## మున్సిపల్ బీజేపీ నూతన కార్యవర్గం ఎన్నిక

**కార్యవర్గ సభ్యులను సన్మానించిన ఎంపీ ఈటల రాజేందర్**

**మేడ్చల్,జూన్15. ప్రభాతవార్త:** గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ నూతన పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కావేరీ శ్రీధర్ ముధిరాజ్ ఆధ్వర్యంలో ఎన్నుకున్న ఈ కమిటీ ప్రధాన కార్యదర్శులుగా జై కృష్ణ, రామారావు, ఉపాధ్యక్షులుగా వసంత్ రెడ్డి, బాలకృష్ణ, శ్రీకాంత్, రాజ్, కార్యదర్శులుగా నర్సింగ్ రావు, వెంకటేష్, సత్యనారాయణ, బిజుగోపాల్, కోశాధికారిగా వీరా రెడ్డి, ఐటీ సోషల్ మీడియా కన్వీనర్‌గా ప్రవీణ్ ఎన్నికైయ్యారు. కాగా ఈ కమిటీ సభ్యులకు మల్కాజ్‌గిరి ఎంపీ రాజేందర్ నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పదవులు పొందిన ప్రతి నాయకుడు పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు. ప్రజాసమస్యలపై ఎప్పిటికప్పుడు స్పందిస్తూ, రాబోయేరోజులలోపార్టీని క్షేత్ర స్థాయిలో మరింత బలపర్చాలని తెలిపారు. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు.జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, జిల్లా నాయకులు అమరం మోహన్ రెడ్డి, సముద్రాల కృష్ణ గౌడ్, మాజీ కౌన్సిలరు దొడ్ల మల్లికార్జున్, అమరం సరస్వతి, నాయకులు, కిషన్, వెంకటేష్, అశోక్, అర్జున్, మహేందర్ రెడ్డి, సురేష్ ముదిరాజ్, విక్రమ్ పాల్గొన్నారు.

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## బిజెపి మండల సంకల్ప సభ

**మేడ్చల్, జూన్ 15. ప్రభాతవార్త** : దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపడుతున్న సుపరిపాలన వారోత్సవంలో భాగంగా ఆదివారం ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలోని రావల్‌కోల్ గ్రామంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఎక్కల్ దేవి శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో మండల సంకల్ప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు గౌరారం జగన్ గౌడ్ మాట్లాడుతూ భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాలుగా ప్రజా సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారని, దేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఒత్తిడులకు తలొగ్గకుండా దేశ ప్రజల బాగు కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులను మట్టుబెట్టారని తెలిపారు. నేడు ప్రపంచమే భారతదేశం వైపు చూసే విదంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. ఈ మున్సిపల్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పుష్ప మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ ఎన్ సత్యనారాయణ, నాయకులు ఆకుల రవీందర్, పి మహేష్, ఉషిరి గారి బాబు, బాలకృష్ణ, చుక్క శంకర్, వై బిక్షపతి, వై నవీన్ యాదవ్, చుక్క సత్యనారాయణ, వై మహేందర్, ఎండి మున్వర్, ఏమ్ మహేందర్ యాదవ్, జి రమేష్, శ్రీకాంత్, డి శ్రీకాంత్ రెడ్డి, జి బిక్షపతి, జీడిపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డికి నివాళులు

**అర్పించిన ..రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**
**అంతాయిపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో**



**శామీర్‌పేట, జూన్ 15, ప్రభాతవార్త:**మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి దశదిన కార్యక్రమంలో రాష్ట్ర ఫౌరసరఫరాల,నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించారు. ఆదివారం శామీర్‌పేట మండలంలోని తూంకుంట మున్సిపాల్టీ పరిధిలో ఉన్న అంతాయిపల్లిలోని మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయన దశదిన కర్మ, సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రగాఢ సంతాపంను వ్యక్తం చేసి మాగం రంగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుబూతిని వారు తెలియజేశారు. ఇటీవలనే అంతాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి అనారోగ్యంతో ఉండి నగరంలోని ఆయన నివాసంలో మృతిచెందిన సంగతి తెలిసిందే. ఆయన స్వగ్రామం అంతాయిపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించిన విషయం విధితమే. ఆదివారం జరిగిన దశదిన కార్యక్రమం సందర్భంగా పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, వివిధ పార్టీల నాయకులు,అభిమానులు పాల్గొని సంతాపం వ్యక్తం చేసి ఆయన మాగం రంగారెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు.

## శామీర్‌పేటలో దర్గా ఉర్సు

**పాల్గొన్నా మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి**



**శామీర్‌పేట, జూన్ 15, ప్రభాతవార్త**శామీర్‌పేటలోని సయ్యద్ జలాలుద్దీన్ ముల్తానీ బాబా దర్గా ఉర్సు ఉత్సవంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి పాల్గొని ప్రార్థనలు చేశారు. ఆదివారం మధ్యాహ్నం శామీర్‌పేటలోని దర్గా ఉర్సు ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఉర్సు ఉత్సవ కార్యక్రమాలు మూడు రోజుల నుంచి కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా విచ్చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డికి ముస్లీం మత పెద్దలు, పలువురు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆ తరువాత దర్గాలో బాబాకు ఆయన చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. శామీర్‌పేట దర్గా ఉర్సును పురస్కరించుకుని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మండల బిఆర్ఎస్ నాయకులతో, ముస్లీం సోదరులతో కలిసి విచ్చేసి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా శామీర్‌పేటలోని ముస్లీంలు, చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడ సందల్ రావటం, దర్గాలో బాబాకు చాదర్ కప్పి ముస్లీం మత సోదరులు ప్రార్థనలు చేశారు. దర్గా వద్ద ఉర్సు సందర్భంగా పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి వెంట శామీర్‌పేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, బిఆర్ఎస్ ఉమ్మడి మండల సీనియర్ నాయకులు జి.హరిమోహన్‌రెడ్డి, అలియాబాద్ గ్రామ మాజీ సర్పంచు గుర్క కుమార్‌యాదవ్, శామీర్‌పేట మండల బిఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ ఎం,ఐలయ్యయాదవ్, డైరక్టర్ వంగ భూమిరెడ్డి, మాజీ ఉపసర్పంచు ఎన్.రమేశ్, మండల నాయకులు చాంద్‌పాష, దాసరి బాబు,ఎండి ఇర్ఫాన్, ఆర్.శ్రీనివాస్, డి.నవీన్, సత్యనారాయణ, సాధిక్, పలువురు ముస్లీం మత పెద్దలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు..



**శంకర్ పల్లి, జూన్ 15, ప్రభాత వార్త:** మండలంలోని కొండకల్ తండావాసులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలో ఆదివారంతో 150వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న పలువురు గిరిజనులు మాట్లాడుతూ.. గిరిజనులకు సంబంధించిన 80 ఎకరాలకుపైగా భూమిని కార్పోరేట్ శక్తులు కబ్జా చేసి వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయమై గత ఆరు నెలలుగా చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అధికారులు ప్రభుత్వం స్పందించి గిరిజనలకు న్యాయం చేయాలని కోరారు.

## కారును ఢీకొట్టి పల్టీపడిన క్యాబేజీ వ్యాన్

**-ఇద్దరికి స్వల్పగాయాలు**



**ఘట్‌కేసర్,జూన్15,ప్రభాతవార్త:** క్యాబేజీ నింపుకొని వెళ్తున్న వ్యాన్ ముందకుగా వెళ్తున్న కారును డీకొట్టి పల్టీపడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నగరంలో క్యాబేజీ కూరగాయలను నింపుకొని భువనగిరి వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వ్యాన్ (టిజి24టి-1988) ఘట్‌కేసర్ బైపాస్ రహదారిపై వందన హోటల్ వద్దకు రాగానే ముందుగా వెళ్తున్న ఎస్‌క్రాస్ కారు (టిఎస్08జివై-5859)ను ఢీకొట్టి పక్కకు పల్టీ కొట్టింది. దీంతో వ్యాన్ డ్రైవర్, మరొకరి స్వల్ప గాయాలు అయ్యాయి. ఘట్‌కేసర్ పోలీసులు, ఎన్‌హెచ్ఏఐ అత్యవసర వాహనాలు, అంబులెన్సు ఘటనా స్థలానికి చేరుకొని గాయాలైన ఇద్దరిని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంతో వ్యాన్‌లోని క్యాబేజీలు కింద పడి పోగా కారు వెను భాగం దెబ్బతిన్నది. ఈమేరకు బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

## గ్రామీణ ప్రాంతంగా ఉన్నా కొత్త మున్సిపాల్టీలు ఏర్పాటు

**శామీర్‌పేట,జూన్ 15, ప్రభాతవార్త:** శామీర్‌పేట ఉమ్మడి మండలంలోని అన్నిగ్రామాలు పూర్తిగా గ్రామీణ ప్రాంతంగా ఉన్నప్పటికీ అన్ని గ్రామాలనుకూడ మున్సిపాల్టీలుగా ప్రభుత్వం ఏర్పాటు చేయటం జరిగింది.గ్రామాలుఅన్నికూడగ్రామీణవాతావరణంలోనే ఉన్నా వ్యవసాయ ప్రాంతాలుగాకనిపించటం జరుగతున్నా, గ్రామ పంచాయతీలకు గ్రామాలకుమధ్యదూరంగఉన్నప్పటికీ అన్నిగ్రామాలను మున్సి పాల్టీలు గామార్చేసింది. ఇక శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో గ్రామ పంచాయతీలు అంటూ లేకుండా పోయాయి. గత ఐదేళ్ల క్రితం అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం శామీర్‌పేట ఉమ్మడి మండలంలో ఉన్న తూంకుంటను కొన్ని గ్రామాలను కలిపి మున్సిపాల్టీగా చేసింది. అదే విధంగా ఐదేళ్ల క్రితం ఈ మండల పరిధిలోనే నాడు ఉన్న జవహర్‌నగర్‌ను మున్సిపల్ కార్పోరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఇక గత ఏడాదిలో మున్సిపల్ ఎన్నికలు జరిగి ఐదేళ్ల పదవీ కాలం పూర్తి జరిగి మళ్లీ ఎన్నికలు జరగలేదు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఓఆర్ఆర్ సమీప గ్రామాలుగా ఉన్న శామీర్‌పేట మండలంలో ఉన్న శామీర్‌పేట, బాబగూడ, బొమ్మరాసిపేట్ గ్రామాలను కూడ తూంకుంట మున్సిపాల్టీలో ఆ మూడు గ్రామాలను విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఇక ఈ ప్రభుత్వం శామీర్‌పేట మండలంలో మిగిలిన ఆరు గ్రామపంచాయతీలను (గ్రామాలను) కలిపి అలియాబాద్‌ను నూతన మున్సిపాల్టీగా ఏర్పాటుచేసింది. అదేవిధంగా మూడుచింతలపల్లి మండలంలోని 13 గ్రామపంచాయతీలనుకలిపి మూడుచింతపల్లిని నూతన మున్సిపాల్టీగా ఏర్పాటు చేసింది. ఇకశామీర్‌పేట మండల పరిధిలో ఉన్న పొన్నాల్ గ్రామపంచాయతీని మూడుచింతలపలి మున్సిపాల్టీలోవిలీనం చేసింది.14గ్రామ పంచాయతీలతో ఎంసిపల్లి మున్సిపాల్టీ ఏర్పాటు జరిగింది. అయితే పొన్నాల్‌ను అలియాబాద్ మున్సిపాల్టీలో ఉండేలా చూడాలని ఆ గ్రామస్థులు,నాయకులు ఇప్పటికీ ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నారు. ఇప్పటికే ఆయా మున్సిపాల్టీల్లో మున్సిపల్ పాలన ఆరంభమైన సంగతి తెలిసిందే. గతంలో ఉన్న తూంకుంట మున్సిపాల్టీలో 16వార్డులు ఉండగా, కొత్తగా మూడు శామీర్‌పేట, బాబగూడ, బొమ్మరాసిపేట్ గ్రామాలు విలీనం కావటంతో మరిన్ని వార్డులు ప్రస్తుతం మాత్రం పెరిగే అవకాశం ఉందని చెప్పవచ్చు. ఇక కొత్తగా ఏర్పాటు చేసిన అలియాబాద్ మున్సిపాల్టీలో 22వార్డులు గుర్తించారు. మూడుచింతలపల్లి మున్సిపాల్టీలో 24వార్డులు గుర్తించారు. ఇక వీటికి ఎన్నికలు ప్రభుత్వం నిర్వహించాల్సి ఉందని చెప్పవచ్చు.

మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించ వచ్చని ముందుగానే వార్డులు సంబంధిత అధికారులు సిద్ధం చేసి ఉన్నారు. తూంకుంట మున్సిపాల్టీ రానున్న రోజుల్లో జిహెచ్ఎంసిలో విలీనం కావచ్చని కూడ జోరుగా ప్రచారం సాగుతుంది. తూంకుంటను మున్సిపాల్టీగ ఉంచుతారా లేక హైదరాబాద్ జిహెచ్ఎంసిలో విలీనం చేస్తారా అనేది చర్చనీయాంశంగ మారింది. గతంలో శామీర్‌పేట మండలంలో ఉన్న జవహర్‌నగర్‌ను కాప్ర మండల పరిధిలో చేర్చారు. జవహర్‌నగర్ మున్సిపల్ కార్పోరేషన్ కూడ జిహెచ్ఎంసిలో విలీనం కావచ్చని కూడ జోరుగా ప్రచారం జరుగుతుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నగర శివారులోని మున్సిపాల్టీలను జిహెచ్ఎంసిలో విలీనం చేస్తాయా లేక యధావిధిగా మున్సిపాల్టీలను ఉంచుతాయా అనేది ప్రశ్నార్థకంగానే ఉంటుంది. ఏది ఏమైనా శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని గ్రామాలుగ్రామీణప్రాంతంగఉన్నఆ గ్రామాలను పూర్తిగా మున్సి పాల్టీలుగారూపొందించి పరిపాలనప్రారంభించింది. ఇక మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని చెప్పవచ్చు. ప్రస్తుతం మాత్రం తూంకుంట మున్సిపాల్టీకి స్పెషల్ ఆఫీసర్‌గా సంధ్య, మున్సిపల్ కమిషనర్‌గా ఆర్ వెంకట గోపాల్ కొనసాగుతున్నారు. కొత్తగాఏర్పాటుచేసినఅలియాబాద్‌మున్సిపాల్టీకి




కొత్త మున్సిపాల్టీ కార్యాలయం పరిపాలన భవనం ఏర్పాటు జరిగిన దృశ్యం

నూతన కమిసనర్‌గా చంద్రశేఖర్‌ను ,మూడుచింతలపల్లి మున్సిపాల్టీకి కమిషనర్‌గా పవన్ కుమార్‌ను నియమించి పరిపాలనకొనసాగి స్తున్నారు.ఇక శామీర్‌పేటవ ండలంలో సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, జడ్పీటిసిల అంటూ లేకుండా పోయారు. అన్నిగ్రామాలుకూడ మున్సిపాల్టీలుగా మారటంతో మున్సిపల్ చైర్మన్‌లు, వైస్‌చైర్మన్, కౌన్సిలర్ పదవులకు ఎన్నికలు జరుగనున్నాయి. దీనికి సంబంధించి మున్సిపాల్టీల్లోని గ్రామాలను వార్డులు రూపొందించటం వాటికి రిజర్వేషన్లు కూడ ఖరారు చేసే అవకాశం ఉందని చెప్పవచ్చు. గ్రామపంచాయతీ వ్యవస్థ కనుమరుగు అయి పురపాలక (మున్సిపల్) వ్యవస్థ ఆరంభమైంది. ఇక అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటికే రానున్న మున్సిపల్ ఎన్నికల కోసం ఆశావహులు సిద్దం అవుతూ ప్రజల్లో ఉండటానికి ప్రాధాన్యతను ఇస్తున్నారు. గ్రామాల్లో ఇప్పటికే రాజకీయ వేడి ఆరంభమైందని కూడ చెప్పవచ్చు. పార్టీల శ్రేణులు అందరు కూడ ఎన్నికల కోసం ఎదరు చూస్తున్నారు.

## ప్రైవేటు పాఠశాలలకు పట్టని నిబంధనలు

**వికారాబాద్, జూన్ 15, ప్రభాతవార్త** : విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యిందంటే చాలు ప్రైవేటు పాఠశాలల దోపిడి మామూలుగా ఉండదు. పేరుకేఅన్ని బయటే కొనుగోలు చేయాలని చెబుతారు. బయట ఉన్న వ్యాపారులతోకుమ్మక్కై వారికి రావాల్సి కమీషన్ వారు తెప్పించుకుంటారు. రాజకీయ పలుకుబడి ఉన్నపాఠశాల యాజమాన్యాలైతే పాఠశాల ఆవరణలోనేబాహాటంగానోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫాం, విద్యార్థులకు అవసరమయ్యే ఇతర సామాగ్రిని సైతం అధిక ధరలకు విక్రయిస్తారు. ఏకంగా ఓ బట్టల దుకాణం, బుక్ స్టాల్స్‌లను తలపించేలా పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులకు ఇక్కడే పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని వత్తిడి తెస్తున్నారు.నిబంధనలుతెలిసిన తల్లిదండ్రులు ఇదేమిటని ప్రశ్నిస్తే..ఎ ట్టణంలోని పలాన దుకాణంలో లభిస్తాయి..అక్కిడి వెళ్ళి కొనుగోలు చేయాలని సూచిస్తారు. సదరు ఆ షాపు యజమానికి సైతం అధిక ధరలకే స్కూల్ యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ విక్రయిస్తారు. ఇదేమిటని ప్రశ్నిస్తే..స్కూల్ వారికి సైతం తాము కమీషన్ ఇవ్వాలని సదరు వ్యాపారులు బాహాటంగా చెబుతున్నారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు దోపిడీకి తెర లేపారు.

**-ఫీజుల వసూళ్ళలో నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలు...**

తెలంగాణ ఏర్పడి 11 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నిబంధనలే అమల్లో ఉన్నాయని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. పక్కరాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ప్రత్యేకంగా చట్టం రూపొందించి ఫీజులనియంత్రణ, ఇతరనిబంధనల విషయంపై కట్టుదిట్టమైన నిబంధనలు అమలు చేస్తున్నారు. దీంతో కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యనందించేందుకుపక్క రాష్ట్రం కృషి చేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. విద్య అవసరమని వ్యాపారం చేసే ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల ఆగడాలకు సైతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్డుకట్ట వేసిందని పలువురు మేధావులు ప్రశంసిస్తున్నారు. ప్రాంతాల వారిగా ప్రైవేటు పాఠశాల ఫీజుల వివరాలను ప్రకటించి విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలను ఆ ప్రభుత్వం పొందుతుంది. పంచాయితీల పరిధిలో ప్రైమరీ స్కూళ్లకు అనగా..నర్సరీ టూ 5వ తరగతి వరకు రూ.10 వేలు, సెకండరీ స్కూళ్లకు అనగా..6 నుంచి 10వ తరగతి వరకు రూ.12 వేలు, మున్సిపాలిటీ పరిధిలో ప్రైమరీ స్కూళ్లకు రూ.11 వేలు, సెకండరీ స్కూళ్లకు రూ.15 వేలు, కార్పోరేషన్ పరిధిలో ప్రైమరీ స్కూళ్లకు రూ.12 వేలు, సెకండరీ స్కూళ్లకు రూ.18 వేలు వేలు విద్యార్థి ఒక్కంటికి ఫీజులను వసూలు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

**-క్యాబిన్‌లో కూర్చొని కార్పోరేట్ బిల్డప్...**

వికారాబాద్ పరిధిలో 35 ప్రైవేటు స్కూల్స్ కొనసాగుతున్నాయి. వాటిలో చెప్పుకోదగినవి 8 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. మిగతా స్కూళ్ల అంతంతమాత్రంగా కొనసాగుతున్నాయి. ఇదే అవకాశంగా భావించిన పేరున్న పాఠశాలలు కార్పోరేట్ మాదిరి బిల్డప్ ఇచ్చి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. దీంతో వీరి ధాటికి చిన్న చిన్న ప్రైవేటు స్కూల్స్ తట్టుకోలేక మూత పడే పరిస్థితి నెలొంది. కార్పోరేట్ స్థాయి వసతులైన కల్పిస్తున్నారా అంటే అది ఒట్టి మాటే...స్కూల్ లోపల రెండు ఏసీ అద్దాల గదులను ఏర్పాటు చేసుకుని, ఇద్దరేసి అటెండర్లను క్యాబిన్ డోర్ తెరిచేందుకు..మూసేందుకు పెట్టుకుంటారు. విద్యార్థులను చేర్పించేందుకు పాఠశాలకు తల్లిదండ్రులు వస్తే..10 నిమిషాలు వేచి ఉంచి లోపలికి అనుమతిస్తారు. ఫీజు ఎంత అని తల్లిదండ్రులు అడుగగానే... సెంకడరీ స్కూల్‌కు ఒక్కో విద్యార్థికి రూ.30 వేల నుంచి 80 వేల వరకు అంటూ తాఫీగా సమాధానం ఇస్తారు. వారి బిల్డప్ చూసిన తల్లిదండ్రులు నిజంగానే కార్పోరేట్ స్థాయి విద్య బోధిస్తారని భావించి సరేనని తలూపి విద్యార్థులను చేర్పించడం జరుగుతుంది.

**-ఫీజుల వసూలు..వ్యయాలపై గోప్యత...**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వసూలు చేయాల్సిన ఫీజుల కంటే..వికారాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నాలుగు రెట్లు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వసూలు చేసిన ఫీజులో 50 శాతం మొత్తాన్ని సిబ్బంది జీతభత్యాలకు వెచ్చించాలి, 15 శాతం నిధులను సంస్థ నిర్వహణ అయిన అద్దె, విద్యుత్ చార్జీలు, ఇతర ఖర్చులకు వినియోగించాలి. 20 శాతం నిధులను విద్యా సంస్థ అభివృద్ధికి కెటాయించి, మిగతా 15 శాతం లాభం మాత్రమే యాజమాన్యం ఆశించాలి. అలా కాకుండా వసూలు చేసిన ఫీజులో దాదాపు 70 శాతం లాభానికి వినియోగించి మిగతా 30 శాతం ఇతర వ్యయాలకు వెచ్చిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నిబంధనలను గాలికి వదిలి ధనార్జనే ధ్యేయంగా వికారాబాద్ లోని ప్రైవేటు పాఠశాల యజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. . అలా కుదరని పక్షంలో ఫీజు రశీదుపై ఈ వివరాలు ఇవ్వాలి. ఏ ఒక్క పాఠశాల కూడా ఇలాంటి నిబంధనలు పాటించిన దాఖలాలు లేవని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. ఇప్పటికైన సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలి



**రంగారెడ్డి జిల్లా బిసి సేన అధ్యక్షులుగా సదర్ శ్రీనివాస్‌యాదవ్ ఎన్నిక**

**షాద్‌నగర్‌రూరల్, జూన్ 15, ప్రభాత వార్త** : ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి బీసీలు ఎదగాలని, భారతదేశంలో బడుగు బలహీన వర్గాలైన బీసీలు సమాజంలో గణనీయమైన వాటా కలిగిఉన్నారని సంఖ్యాపరంగా అత్యధికంగా ఉన్నప్పటికీ, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఇంకా ఆశించిన స్థాయిలో ఎదగలేకపోయామని బీసీ సేన జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి బీసీలు ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా బీసీ సేన అధ్యక్షులుగా శ్రీను యాదవ్‌ను ఎన్నుకున్నా సందర్భంగా ఆదివారం షాద్‌నగర్ బైపాస్‌లోని హోటల్ ఎన్‌హెచ్ 44లో నియోజకవర్గం అధ్యక్షులు కత్తి శేఖరప్ప ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కి బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... బీసీ సమాజాభివృద్ధి కోసమే బీసీ సేన పనిచేస్తుందని, మనమంతా ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. మన హక్కులు, మన ఉద్యోగాలు మనం సాధించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్.కృష్ణయ్య బీసీ సమాజాభివృద్ధికోసం ఎన్నో పోరాటాలు చేశారని, వారి కృషివల్లే నేడు బీసీలకు44 శాతం రిజర్వేషన్ ఏర్పాటు అయిందని అన్నారు.ఆయన.సదర్ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ... బీసీ సేన అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తానని, అందరి సహకారంతో, జాతీయ అధ్యక్షులు బర్క కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సేన ఉన్నతికై కృషి చేస్తానని అన్నారు. బీసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వ సుధాకర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, నియోజకవర్గం మహిళా అధ్యక్షులు వరలక్ష్మి, కార్యదర్శి శారద, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు వెంకటేష్, యువజన విభాగం నియోజకవర్గం అధ్యక్షుడు చటాన్‌పల్లి శ్రీనివాస్, కేశంపేట అధ్యక్షుడు దేవేందర్, నియోజకవర్గం మహిళా ప్రధాన కార్యదర్శి సౌజన్య, బీసీ సేన నేతలు జలజ, స్రవంతిరాజ్, భాగ్యలక్ష్మి, అనిత, శ్రీనివాస్, శివకుమార్, మహేష్, వరప్రసాద్, గణేష్, వెంకటేషులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు : రామ్మోహన్ రెడ్డి

**-పరిగి శాసన సభ్యుడు టి రామ్మోహన్ రెడ్డి**

**కుల్కచర్ల,జూన్15,ప్రభాతవార్త** : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని పరిగి శాసనసభ్యుడు టి.రామ్మోహన్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్పటి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం చౌడాపూర్ మండల కేంద్రంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మరికల్ గ్రామంలోని రైతు వేదికలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ స్థానిక నాయకులు అధికారులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగి నియోజకవర్గంలోని పేదలందరికీ ప్రజల వారీగా ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు. పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాల ు అర్హులైన పేదలందరికీ అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో 7 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీసిందని రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగా లేనప్పటికీ చిత్తశుద్ధితో అభివృద్ధి సంక్షేమ ఫలాల ు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇల్లు రానివారు నిరుత్సాహ పడకూడదని విడతలవారీగా అందరికీ ఇల్లు అందేలా నిరంతర ప్రక్రియ కొనసాగుతుందని ఆయన సూచించారు. రాష్ట్రంలో ప్రతి పేదవారు సన్న బియ్యం తినాలని సంకల్పంతో రేషన్ కార్డు ద్వారా సన్నబియ్యం



ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

అందిస్తున్నామని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందిస్తున్నామని ఆయన అన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే వారికి స్టీలు సిమెంటు అందించే విధంగా కంపెనీలతోమాట్లాడుతున్నామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఎంపీడీవో సోమలింగం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, పి ఎస్ ఎస్ వై చైర్మన్ నాగరాజు, నరసింహారెడ్డి దామోదర్ రెడ్డి, రాములు, సలీం, వెంకటయ్య గౌడ్, సత్య కుమార్ కృష్ణాజి మండల పార్టీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## తూంకుంటలో వికసించిన బ్రహ్మ కమలం

**శామీర్‌పేట,జూన్15,ప్రభాతవార్త:** తూంకుంటగ్రామంలో బ్రహ్మ కమలంపువ్వులు వికసించి అందరిని ఆకట్టుకున్నాయి. శనివారం రాత్రి శామీర్‌పేట మండలంలోని తూంకుంటలోని జి.మృత్యుంజరావు నివాసంలో అరుదైన విధంగా బ్రహ్మ కమలంపువ్వులు వికసించి అందరిని ఆకర్షింప జేశాయి.

ఆ రాత్రి అరుదైన తీరులో ఆ పువ్వులు వికసించాయి. ఏడాది కోసారిమాత్రమే అరుదుగా ఈ బ్రహ్మకమలంపువ్వులు వికసిం చటం జరుగుతుందని అన్నారు.

హైందవ సాంప్రదాయంలో బ్రహ్మ కూర్చునే పువ్వులుగా పరిగణిస్తామని ఈ పువ్వులు వికసించి అందరిని భక్తిపారవశ్యాన్ని చాటినట్లు ఆయనతోపాటు పలువురు పేర్కొన్నారు.ఇంటి ఆవరణలో పలు పూల మొక్కలు ఉన్నట్లు, వీటితో పాటు బ్రహ్మ కమలం పూల మొక్కలు



కూడ ఉన్నట్లు తెలిపారు. శనివారం రాత్రినుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు ఉన్నట్లు రాత్రి పలువురు దర్శించుకున్నట్లు, తమ కుటుంబ సభ్యులతో పాటు పలువురు పూజలు చేసినట్లు మృత్యుం జయరావు పేర్కొన్నారు. సాదారణంగా బ్రహ్మకమలం పువ్వులు వికసించే సమయంలో చూడటం అరుదు అని చాలా వరకు తక్కువగా అవకాశం దక్కుతుందని ఈ పువ్వులు వికసించి అందరిని ఆకట్టుకున్నట్లు తెలిపారు.



ఉత్తమ విద్యార్థులకు ధృవీకరణపత్రాలు అందజేస్తున్న దృశ్యం

## తైక్వాండాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలు అందజేత

**సిద్దిపేట అర్బన్, జూన్ 15, ప్రభాతవార్త :** తైక్వాండో నేర్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందని జిల్లా తైక్వాండో గౌరవాధ్యక్షులు, బిఆర్ఎస్ నేత వేలేటి రాధాకృష్ణ అన్నారు. జిల్లా కేంద్రం లోని ఐఎంఎ హాల్‌లో ఆదివారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ నిర్వహించిన తైక్వాండో కలర్ బెల్ట్ ప్రమోషన్ టెస్ట్‌లో 60 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభను కనబరిచి గెలుపొందినవారికి కలర్ బెల్టులు, ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తైక్వాండో, వివిధ క్రీడలు నేర్చుకోవడం వల్ల 2 శాతం స్పోర్ట్స్ కోటాలో విద్యా, ఉద్యోగం లభిస్తాయన్నారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను మాట్లాడుతూ సిద్దిపేట తైక్వాండో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణీత, బెల్ట్ ఎగ్జామ్ ఆర్గనైజర్ జిల్లా తైక్వాండో కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నాయకుడిపై హత్యాయత్నం చేసినవారిని అరెస్టు చేయాలి



పాత బస్టాండు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, జూన్ 15, ప్రభాతవార్త :** విద్యార్థి నాయకుడిపై హత్యాయత్నం చేసినవారిని వెంటనే అరెస్టుచేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఆదివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం విద్యారంగ, దేశ, సామాజిక సమస్యలపై పోరాటం చేసే ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సావుల ఆదిత్యపై రాజ్యాంగ వ్యతిరేక గుండాలు దాడి చేయడం సరికాదన్నారు. కొన్ని దుష్ట శక్తులకు మొదటి నుంచి రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదన్నారు. ఏబీవీపీ కార్యకర్తలు తుపాకులకు, తాటాకు చప్పుళ్లకు భయపడరని తెలిపారు. దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యసమితి సభ్యుడు వివేక్, రాష్ట్ర హాస్టల్ కో-కన్వీనర్ పవన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఫణీంద్ర, నగర కార్యదర్శి పర్శురామ్, రాహుల్,వసంత్, లోకేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు రాజీనామ చేయాలి

-సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తాజోద్దీన్



మాట్లాడుతున్న సభ్యులు తాజోద్దీన్

**సదాశివపేట, జూన్ 15, ప్రభాతవార్త:** అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న విమాన ప్రమాదానికి భాధ్యత వహిస్తూ కేంద్ర విమానాయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు మంత్రి పదవికి రాజీనామా చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తాజోద్దీన్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సిపిఐ కార్యాయలంలో ఏఐటీయుసి మండల కార్యదర్శి శంకరప్పతో కలిసి తాజోద్దీన్ మాట్లాడుతూ ఏవియేషన్ రంగంపై అనుభవం లేని ఎంపిని మంత్రి బాధ్యతలు అప్పగిస్తే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకునే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిసిఐ నాయకులు ముస్తఫా, అనుసుజ, వెంకట్ గౌడ్, సాదిక్ అలీ యాకుబ్, బిపాషా, నర్సమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ కోటేశ్వర్‌రావును సన్మానించిన బిఆర్ఎస్ నేతలు



ఎస్ఐ కోటేశ్వర్‌రావును సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**మనూర్, జూన్ 15, ప్రభాతవార్త:** మనూర్ పోలీసు ఠాణా ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ కోటేశ్వర్‌రావును ఆదివారం బిఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని సూచించారు. ఎస్ఐ కోటేశ్వర్‌రావును సన్మానించిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు విఠల్‌రావు, నాయకులు జనార్ధన్‌రెడ్డి, సుధాకర్, రాజేంద్రరావు, అశోక్‌రెడ్డి, చంద్రకాంత్, ముజీబ్, మనను, మల్లేష్ తదితరులు ఉన్నారు.

## దోసపల్లిలో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

**మనూర్, జూన్ 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దోసపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బిరదర్ దత్తు ఆదివారం భూమి పూజ నిర్వహించి ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బిరదర్ దత్తు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ధరఖాస్తులు చేసుకున్న అర్హులైన ప్రతి పేద వారికి ఎంపి సురేష్‌కుమార్ శెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిలు మంజూరు చేయిస్తామని హామి చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నారాయణ, జగనాథ్, వీరన్న, దేవప్ప, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజలు చేస్తున్న బిరదర్ దత్తు

# కుల సంఘాల అభివృద్ధికి సహకరిస్తా : ఎమ్మెల్యే



చర్చి నిర్మాణానికి 80 గజాల స్థలం కేటాయింపు పత్రాలు అందచేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, జూన్ 15, ప్రభాతవార్త:** కుల సంఘాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నానని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసినకార్యక్రమానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మరనాత చర్చి నిర్మాణానికి 80 గజాలు, నాయీ బ్రాహ్మణ సంఘానికి కొమరం భీం కాలనీలో 150 గజాల స్థలాన్ని కేటాయిస్తూ సంఘాల అధ్యక్షులకు ప్రొసీడింగ్ పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో తను చేసిన ప్రతి హామిని అమలు చేస్తున్నట్లు గుర్తు చేశారు. సమాజంలో వెనుకబడిన వర్గాల ఆర్థిక అభ్యున్నతికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందచేలా చర్యలు తీసుకుంటున్నానన్నారు. ప్రొసీడింగ్ పత్రాలు అందుకున్న కుల సంఘాల అధ్యక్షులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సోమిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, వెలిమెల సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, ప్రభుత్వ ప్లీడర్ ప్రభ రాగం దేవేందర్ యాదవ్, లచ్చిరామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, నాగరాజు, శ్రీకాంత్, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



బొల్లారంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

## బొల్లారంలో 'రచ్చబండ'

**బొల్లారం, జూన్ 15,ప్రభాతవార్త:** బొల్లారం మున్సిపాలిటీలో ఆదివారం రోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పరిపాలన 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తెలంగాణ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి, ఆదేశాల మేరకు బొల్లారం మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షులు ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ..రచ్చబండ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.బొల్లారం లోని లక్ష్మీ నగర్ కాలనీ, గాంధీనగర్ కాలనీ, పోచమ్మ బస్తి, బాలాజీ నగర్, కాలనీలలో నరేంద్ర మోడీ 11 సంవత్సరాలలో చేపట్టినటువంటి అభివృద్ధిని పేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ దిలీప్‌కుమార్, శివ, లక్ష్మణ్, అఖిల్, ప్రదీప్, స్రవంతి, విజయ్, నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌చారి, మున్సిపల్ పదాధికారులు శక్తి కేంద్ర ఇన్చార్జీలు బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో అభివృద్ధిపనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చౌదరి సుప్రభాతరావు

**రామాయంపేట, జూన్ 15, ప్రభాతవార్త :** రామాయంపేట మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రోహిత్‌రావు ప్రత్యేక దృష్టి సారించారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు చౌదరి సుప్రభాత్ రావు తెలిపారు. ఆదివారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డ్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు స్పందించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక నిధులు కేటాయించి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సిసి రోడ్, విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధి లోని అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు రమేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చిలుక గంగాధర్, దేమే యాదగిరి, కాంగ్రెస్ నాయకులు అల్లాడి వెంకటేష్, దేవుని రాజు, వినయ్ సాగర్, పోచమ్మల అశ్విని శ్రీనివాస్, యెనిశెట్టి అశోక్ గుప్త, యుగంధర్ రావు, చింతల స్వామి పాల్గొన్నారు

## ఏడుపాయలలో భక్తుల సందడి..

### బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కల చెల్లింపులు

**పాపన్నపేట, జూన్ 15, ప్రభాతవార్త :** భక్తుల కోరికలు తీర్చే తల్లిగా పేరు గాంచిన ఏడుపాయల వనదుర్గ భవాని క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది . రెండవ శనివారం ఆదివారం సెలవు దినాలు కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. వీరు మంజీరా నదిలో పుణ్య స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు , బోనాలు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, శ్యాం, బ్రహ్మాచారి, బత్తినిరాజు, నర్సింలు, వరుణాచారి, యాదగిరి మహేష్ ,నరేష్, దీపక్, తదితరులు ఏర్పాటు చేయగా వేదపండితులు శంకరశర్మ, పార్థివశర్మ, రాము, శేఖర్ నాగరాజు తదితరులు పూజలు నిర్వహించారు, ఏడుపాయలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తమ సిబ్బందితో ప్రత్యేక బందో బస్త చర్యలు చేపట్టారు

## ఘనంగా యోగా కార్యక్రమం

**సైఫాబాద్, జూన్ 15 ప్రభాతవార్త:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తిరునిలయం, బాలజీభవన్‌లో యోగా కార్యక్రమం ఘనంగా ప్రశాంత వాతావరణంలో జరిగింది. తొలుత టిటిడి ఎఈవో యు.రమేష్, ధర్మ ప్రచార పరిషత్ ప్రాజెక్టు ఆఫీసర విజయలక్ష్మి, హరినాథ్ శ్రీవేంకటేశ్వరస్వామికి పూజలు నిర్వహించి యోగా కార క్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పంతాంజలి యోగ కేంద్రం యోగ గురువు శివశంకర్ యోగలో పాల్గొన్న వారందరికి అసనాలను నేర్పించారు.



దేవాలయానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

## కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి :ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, జూన్ 15,ప్రభాతవార్త:** పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని పోచారం గ్రామంలో గల మహిధర లగ్జూరియా కాలనీలో నూతనంగా నిర్మించనున్న శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం భూమిపూజ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కాలనీలో నూతనంగా నిర్మించిన క్లబ్ హౌస్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోచారం గ్రామ పరిధిలో 700 గృహాలతో అత్యాధునిక వసతులతో గేటెడ్ కమ్యూనిటీ ఏర్పాటు కావడం సంతోషకరమన్నారు. కాలనీకి మిషన్ భగీరథ ద్వారా మంచినీరు అందించాలన్న కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు.. త్వరలోనే సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మంచినీరు అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ సమీపంలో గల డంపింగ్ యార్డ్ తరలించేందుకు కృషి చేస్తానని తెలిపారు. వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి సైతం సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో ఏర్పాటు అవుతున్న నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహీధర ప్రాజెక్ట్ సీఎండి ప్రశాంత్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, ముత్తంగి పిఎసిఎస్ అధ్యక్షులు బిక్షపతి, ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు స్వాతి రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, రమణారెడ్డి, పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

**హత్నూర, జూన్ 15, ప్రభాతవార్త: :** మండలం పరిధిలోని సాధుల్‌నగర్, నస్తిపూర్ గ్రామాలలో ఆదివారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నరసాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ముగ్గులు పోసి శ్రీకారం చుట్టారు. పేదల ఇంటి కల సాకారం చేయడానికి సిఎం రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కర్రె క్రిష్ణ ముదిరాజ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటేశం, హకీమ్, దుర్గా రెడ్డి, స్టేట్ జనరల్ సెక్రెటరీ తరుణ్,ప్రసాద్, గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు హౌసింగ్ ఏఈ రమ్య పంచాయతీ కార్యదర్శి నవ్యత తదితరులు పాల్గొన్నారు.

## గాంధీకుటీర్‌లో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం

**సైఫాబాద్, జూన్ 15 ప్రభాతవార్త:**

ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు 'ఒక చెట్టు అమ్మ పేరు' కార్యక్రమంలో భాగంగా హిమాయత్‌నగర్‌లోని గాంధీకుటీర్‌లో బిజెపి నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. దీంతో పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములం అవుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి హిమాయత్‌నగర్ అధ్యక్షురాలు మాధవి, బూత్ అధ్యక్షుడు తులరామ్, కేశబోయిన శ్రీధర్, కవిత, అర్జున్‌సింగ్, కార్తిక్, సీతారాం, కుమార్‌యాదవ్, నర్సింగ్‌గౌడ్, రంజీత్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేటలో ఉచిత వైద్య శిబిరం

**నిజాంపేట్, జూన్ 15, ప్రభాతవార్త :**

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట్ గ్రామం భండారి లేఅవుట్ కాలనీ, రోడ్ నెంబర్ 7బి లైబ్రరీలో ఆదివారం ఆయుర్ వ్రిక్ష్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ స్థానిక 27వ వార్డు మహిళా మాజీ కార్పొరేటర్ ఎల్లంబాయి జ్యోతి, భండారి లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎల్లంబాయి నర్సింహారెడ్డి. కోశాధికారి పువ్వాడ విజయ రవీంద్ర బాబు, కాలనీ సంక్షేమ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పరిపాలన చేతకాకే ప్రశ్నించే వారిపై కేసులు



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**హుస్నాబాద్ టౌన్, జూన్ 15, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలన చేతకాకే ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారిపై అక్రమంగా కేసులు నమోదు చేపిస్తుందని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిలదీస్తున్న బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌పై అక్రమంగా కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. ఇచ్చిన హామీల విషయంలో ప్రజలను పక్కదారి పట్టించేందుకు కెసిఆర్ కుటుంబంపై అనేక విమర్శలు చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ధన సంపాదనకు పాకులాడుతున్నారు తప్ప ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ఇప్పటికైన ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమావేశంలో బిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పర్శురాములు, పట్టణ మాజీ అధ్యక్షులు కన్నోజు రామకృష్ణ, నాయకులు దీకొండ ప్రవీణ్, మేకల వికాస్, రాజు నాయక్, పాకాల శ్యాంసుందర్, అరవింద్, తిరుపతి నాయక్, గడిపె విజయ్‌కృష్ణ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందించిన కాటా శ్రీనివాస్ గౌడ్

## గండిగూడెంలో కరాటే బ్లాక్ బెల్ట్ పోటీలు

**అమీన్‌పూర్, జూలై 15 ప్రభాతవార్త :** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని గండిగూడెంలో ప్రభుత్వ పాఠశాలలో సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నరేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ షావలిన్ కుంగ్‌ఫు కరాటే లయన్ వారియర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ సమక్షంలో మొదటి బ్లాక్ బెల్ట్ అవార్డుల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విద్యార్థులు కుంగ్ ఫు, కరాటేలో వివిధ స్వీయ రక్షణ ప్రదర్శనలు నిర్వహించి, తమ నైపుణ్యాన్ని చూపించారు. బ్లాక్ బెల్ట్ విజయం సాధించిన విద్యార్థులకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు కాట శ్రీనివాస్ గౌడ్‌అందజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి, దయార మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు రైతు నేస్తం కార్యక్రమం : ఏవో

**న్యాల్‌కల్, జూన్ 15, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన న్యాల్‌కల్‌తో పాటు మండలంలోని మామిడ్గి గ్రామాల్లోని రైతు వేదికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రారంభోత్సవ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అభినాశ్ వర్మ పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఏఓ అభినాశ్ వర్మ సూచించారు.

### సిర్గాపూర్ మండలంలో...

**సిర్గాపూర్, జూన్ 15, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన సిర్గాపూర్‌తో పాటు మండలంలోని ముబారక్‌పూర్, కడ్పల్ గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రారంభోత్సవ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఏఓ హరికృష్ణ సూచించారు.

### కింగ్టి మండలంలో...

**కంగ్టి, జూన్ 15, ప్రభాతవార్త:** ఈ నెల 16వ తేదీన కంగ్టితో పాటు మండలంలోని గాజులపాడ్, తడకల్ గ్రామాల్లోని రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రారంభోత్సవ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి హరీష్ పవార్ పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఏఓ హరీష్ పవార్ సూచించారు.

### చిన్నశంకరంపేటలో...

**చిన్నశంకరంపేట, జూన్ 15,ప్రభాతవార్త:** నేడు(సోమవారం) రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవిణ్ ఒక ప్రకటనలో తెలిపారు. 1031 రైతు వేదికలకు విడియో కాన్ఫరేన్స్ ద్వారా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రైతులకు సాగులో సలహాలు, సూచనలు వంటివి ఈ కార్యక్రమం ద్వారా రైతులకు అందించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గోనాలని ఆయన కోరారు.

## రైతు భరోసాకు ధరఖాస్తులు చేసుకోండి : ఏవో

**కంది, జూన్ 15, ప్రభాతవార్త:** వ్యవసాయ భూమి ఉన్న రైతులు రైతు భరోసాకు ధరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయఅధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మండలంలో 384 మంది రైతులు ఉన్నారన్నారు. అర్హులైన రైతులుతమ పట్టా పాసుపుస్తకం జిరాక్సు పత్రం లేదా తహసీల్దార్ డిజిటల్ సంతకం ఉన్న పేపరు జిరాక్సు పత్రం, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా పుస్తకం జిరాక్సు పత్రాలతో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 5వ తారీఖు లోపు రిజిస్ట్రేషన్ అయిన రైతులు రైతు భరోసాకు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీ లోపు రైతులు ధరఖాస్తులు తమ క్లస్టర్ ఏఈఓలకు అందచేయాలని మండల రైతులకు శ్రీనివాస్‌గౌడ్ సూచించారు.

## 18న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశం

**సదాశివపేట, జూన్ 15, ప్రభాతవార్త:** నెల 18వ తేదీన పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగు సంఘం కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధానకార్యదర్శి టి.పండరి పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర నాయకులు సి చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు పెన్షనర్ల సంక్షేమ కోసం సుప్రీం కోర్టు తలుపులు తెట్టేందుకు వెళుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతి మండలంలో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో సదాశివపేటలో సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల అధ్యక్షులు బి శంకరప్ప అధ్యక్షతన నిర్వహించే సర్వసభ్య సమావేశానికి రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పండరి సూచించారు.

## 4వ తరగతిలో స్పోర్ట్స్ స్కూల్స్‌కు ఎంపికలు

**కొండపాక, జూన్ 15, ప్రభాతవార్త:** కుకునూరుపల్లి, కొండపాక మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు అయా మండలాల ఎంఈఓలు బచ్చలి సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 2025, 2026 విద్యా సంవత్సరంలో మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్‌లో 4వ తరగతిలో ప్రవేశానికి మండలాల స్థాయి ఎంపికలు ఈ నెల 18న కుకునూరుపల్లి, కొండపాక మండలాల విద్యార్థులకు కొండపాక మండల కేంద్రంలోని వేద ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహించబడతాయని వారు తెలిపారు. ఈ సెలక్షన్స్‌ల్లో పాల్గొనదలచిన విద్యార్థిని, విద్యార్థులు ముందుగా అన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. 4వ తరగతిలో ప్రవేశాల కోసం వచ్చే వారు 3వ తరగతి ప్రోగ్రెస్‌కార్డు, బోనఫైడ్, పాస్ ఫోటోలు, అధార్‌కార్డుతో ఉదయం 9 గంటల వరకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఎంఈఓలను ఈ నంబర్లలో 94417 63811, 9949511715 లేదా పిడి భాస్కర్‌రెడ్డి 9989348884ను సంప్రదించాలని సూచించారు.

## లయన్స్ క్లబ్ స్నేహబంధు అధ్యక్షుడిగా దామోదర్‌రావు

**రామాయంపేట, జూన్ 15, ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ రామాయంపేట స్నేహబంధు నూతన అధ్యక్షులుగా వి. దామోదర్ రావు ఎన్నికయ్యారు. శుక్రవారం రాత్రి స్థానిక ప్రగతి రిసార్ట్ లో పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉపాధ్యక్షులు పి. శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శి ఎం. దీప్ చంద్, కోశాధికారి బి. బాలరాజు, సహాయ కార్యదర్శి ఎం. రామరాజు లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమానికి జిల్లా 320డి గవర్నర్ లయన్ నాగేష్ పంపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 202526 సంవత్సర కాలానికి ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులకు రెండవ జిల్లా గవర్నర్ లయన్ డి. నరసింహరాజు ప్రమాణం చేయించారు. మొదటి జిల్లా గవర్నర్ విజయలక్ష్మి, మాజీ గవర్నర్ డా. టీవీపీ చారీ, జిల్లా రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా తదితర ప్రముఖులు హాజరై, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. సంజయ్ గుప్తా ఆరుగురు కొత్త సభ్యులకు క్లబ్ సభ్యత్వం అందజేసి, వారితో ప్రమాణం చేయించారు. లయన్స్ క్లబ్ రామాయంపేట స్నేహబంధు సామాజిక సేవల్లో చురుగ్గా పాల్గొంటూ, సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తోందని నాగేష్ పంపాటి ప్రశంసించారు. నూతన కార్యవర్గం క్లబ్ లక్ష్యాలను మరింత సమర్థవంతంగా నెరవేరుస్తుందని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గురవయ్య, జగన్నాథరావు, జి. కృష్ణమూర్తి, సాగర్, శ్రీనివాసరావు, జి.వెంకటేశం, పిట్ట శ్రీనివాస్, పిట్ట సంధ్యారాణి పాల్గొన్నారు.



నూతన సభ్యులు ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం

# యువకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి

## డిసిపి కార్యాలయం ఎదుట బిజెపి ధర్నా.. ఏసిపికి వినతిపత్రం అందజేత

**అత్తపూర్ జూన్15, ప్రభాతవార్త :** హిందూ యువకులపై పెట్టిన అక్రమకేసులను వెంటనే ఎత్తివేయాలని పలువురు బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ ప్రాంతంలో బక్రీద్ పండుగ మరుసటి రోజు రాత్రి కళేబరాలను తరలిస్తున్న డీసీఎం లారీలను అడ్డుకున్న సంఘటన, అత్తాపూర్ డివిజన్‌లోని పాండురంగనగర్‌లో ఆవులను విధించడానికి తీసుకెళ్తుండగా అడ్డుకున్న హిందూ యువకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ ఆదివారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, గోరక్ష, ఆర్ఎస్ఎస్, భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ డిసిపి ఆఫీసు దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నేతలు మాట్లాడుతూ... మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువకులపై అక్రమ కేసులను రద్దుచేయాలని పెట్టిన కేసులలో సెక్షన్లను మార్చాలని ఇకపై అక్రమ అరెస్టులను ఆపాలన్నారు. అలాగే అక్రమంగా చట్ట వ్యతిరేకంగా జంతు కళేబరాలనుతరలిస్తున్నటువంటి డీసీఎం యజమానులపై, వాటి నిర్వాహకులపైన కేసులు పెట్టాలన్నారు. పోలీసులు ఒక వర్గంపై మాత్రమే కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. ఈ విషయాలపై హిందూ సంఘాలు భారతీయ జనతా పార్టీ నాయకులు డిసిపి అందుబాటులో లేకపోవడం వలన ఏసీపికి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు రమేష్‌బాబు, గోరక్ష ప్రముక్ విశాల్‌ప్రసాద్, విశాల్ సునాకర్, భానుమూర్తి, దీపక్‌యాదవ్, ముకేష్‌యాదవ్, సేన రాహుల్, శ్రీరామ్‌యాదవ్, డీజే శ్రీనివాస్, బిజెపి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజభూపాల్ గౌడ్, అంజన్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, వై.శ్రీధర్, ఎన్ మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కొమురయ్య, భాగ్యనగర్ జిల్లా కార్యదర్శి నవీన్ యాదవ్, జోగి రవి, డి లక్ష్మీనారాయణ, ఎస్ విజయ్ కుమార్, అడికే రాజు,ఎన్ జగన్, ఏ జనార్ధన్, హరికిషన్, సోల్కర్‌రెడ్డి, సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు ఎస్ వినయ్‌రెడ్డి, సందీప్ ముదిరాజ్, సులిగే వెంకటేష్, ఎం నాగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు



డిసిపి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న బిజెపి,విహెచ్‌పి, ఆర్ఎస్ఎస్,బజరంగ్‌దళ్ నాయకులు



మాట్లాడుతున్న సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్

## తెలుగు సినిమా కాస్ట్యూమ్ కార్మికులను మోసం చేసిన నేతలపై చర్యలు తీసుకోవాలి

### సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్

**ధర్నాచౌక్, జూన్ 15, ప్రభాతవార్త:** తెలుగు సినిమా పరిశ్రమలో కాస్ట్యూమర్స్‌గా పనిచేసేకార్మికులను మోసంచేసిన యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల, పై, ట్రెజరర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటియూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలుగు సినిమా కాస్ట్యూమర్స్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్య అతిధిగా హాజరై ఎం.వెంకటేష్ మాట్లాడుతూ కాస్ట్యూమర్స్‌గా పనిచేస్తున్న కార్మికుల కోసం భూమి కొని, ఇంటి జాగాలు ఇస్తామని చెప్పి, కార్మికుల వద్ద నుండి డబ్బులు వసూలు చేసి, యూనియన్‌లో ఉన్న డబ్బులను సైతం ఖర్చు చేసి, భూమి కొనకుండా మోసంచేసిన అధ్యక్షులు వాసు,కార్యదర్శి నరసింహా రావు, కోశాధికారి రాంబాబులపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధితులు ప్రజావాణి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు కానీ ఇప్పటి వరకు న్యాయం చేయలేదని, విచారణ లేకుండా కేసును కూడా మూసివేశారని ఆరోపించారు. తెలుగు సినిమా పెద్దలు సైతం దీనిపై ఏమీ మాట్లాడటం లేదని అన్నారు. తెలుగు సినిమా కాస్ట్యూమ్ కార్మికులకు జరిగిన మోసంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షనమే విచారణ జరిపించాలని, లేనిపక్షం పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ నగర అధ్యక్షులు జయ కుమారస్వామి, నగర ఉపాధ్యక్షులు వి.కామేష్‌బాబు, కాస్ట్యూమ్ యూనియన్ వర్కర్స్ ఎస్.కే.బాబ్జి, రమేష్, సాంబశివరావు, రాజు, జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమావేణి పాల్గొన్నారు.

## 17న ఇందిరా పార్కు వద్ద మహాధర్నా

**సైఫాబాద్, జూన్ 15 ప్రభాతవార్త:** ఛత్తీస్‌ఘడ్‌లో జరుగుతున్న ఆదివాసి హననాన్ని అపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ చర్చల కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 17న ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నా విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తెలిపింది. ఆదివారం మార్క్స్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కే.గోవర్థన్, ఐఎఫ్‌టియు జాతీయ నాయకుడు బి.ప్రదీప్, పివోడబ్ల్యూ జాతీయ కన్వీనర్ వి.సంధ్య పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం మధ్యభారతంలో ఉన్న సహజ సంపదను గంప గుత్తాగా కార్పోరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి ఆదివాసీల హననానికి పాల్పడుతున్నదని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం 600 మందిని పొట్టన పెట్టుకున్నదని ఆరోపించారు. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని ఇప్పటికే 5 సార్లు ప్రకటించినా కేంద్రం పట్టించుకోకుండా కాల్పులు జరుపుతూనే ఉందన్నారు. ఈ మహాధర్నాలో జస్టీస్ బి.చంద్రకుమార్, ప్రొఫెసర్ జి.హరగోపాల్, ప్రొఫెసర్ ఎం.కొదండరామ్ తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన పవన్‌కుమూర్ గౌడ్ తదితరులు

### ఆర్‌టిసి బిసి ఉద్యోగుల మహాసభకు

## హాజరు కావాలని మంత్రికి వినతి

**సికింద్రాబాద్, జూన్ 15 ప్రభాతవార్త :** ఈ నెల 24వ తేదీన సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఆర్టీసి బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహా సభకు ముఖ్య అతిధిగా హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆర్టీసి సికింద్రాబాద్ రిజీయన్ గౌరవ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ఆహ్వాన పత్రిక అందజేశారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సభకు రాష్ట్రంలో నీ అందరూ ఉద్యోగులు హాజరు కావాలని అయన పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం, ఆరాధ్య దైవం అయినటువంటి జ్యోతి రావు పూలే జయంతి ఉత్స వలు ఆర్‌టీసీ యాజమాన్యం తరపున ఘనంగా నిర్వహించడం లాంటి పలు అంశాలను ఈ సమావేశంలో చర్చిస్తామని పవన్ కుమార్ గౌడ్ వివరించారు. మంత్రినీ కలిసిన వారిలో ఆర్‌టీసీ బీసీ ఉద్యోగుల సంగం రాష్ట్ర అధ్యక్షులు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి నిరంజన్, కృష్ణ వర్క్‌షాప్ కృష్ణ, వెంకటయ్య, దిజు రావు, సంపత్ పాండు లు పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన గౌరీశంకర్, మహేష్‌కుమార్

**బేగంపేట జూన్ 15,ప్రభాతవార్త :** ఏఐసీసీ సభ్యుడు, టీపీసీసీ మాజీ వైస్ ప్రెశిడెంట్ కటారి గౌరీశంకర్, గ్రేటర్ కాంగ్రెస్ వైస్ ప్రెశిడెంట్ కటారి మహేష్‌కుమార్ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వారు శాలువాతో సత్కరించారు. అనంతరం గౌరీ శంకర్,మహేష్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వం పేదల కోసం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. ఆయన ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న కాలంలో మరెన్నో అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని వారు తెలియజేసారు.



సిఎంను కల్సిన ఎఐసిసి సభ్యుడు కటారి గౌరీ శంకర్, మహేష్‌కుమార్

# గద్దర్ అవార్డును మరో నంది అవార్డుగా మార్చేశారా ?

### ప్రొఫెసర్ కంచ ఐలయ్య

**చిక్కడపల్లి, జూన్ 15 ప్రభాతవార్త:** గద్దర్ అవార్డుల ప్రెజెంటేషన్ అనేది సినిమా నటుల, రాజకీయ నాయకుల వ్యవహారంగా మారిందని,తెలంగాణను సంస్కృతిని భూస్వామ్య స్థితి నుంచి ప్రజాస్వామ్య రూపంలోకి మారడంలో గణనీయ పాత్ర పోషించి, ఆడి, పాడిన వందలాది మంది కళాకారులను, ప్రజా గాయకులను, పాటల రచయితలను తెలంగాణ ప్రభుత్వం మరచిపోవడం చాలా విచారకరమని గద్దర్ స్నేహితుడు, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కంచ ఐలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో విడుదల చేసిన పత్రికాప్రకటనలో పలు అంశాలను ప్రస్తావించారు. తాను గద్దర్ కు చాలా దగ్గరి మిత్రుడిని, గద్దర్‌ను కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వమని ఒప్పించానని, నాకూ ఆహ్వానం రాలేదు, ఇలా చాలా మందికి రాలేదు. నేను రాహుల్‌గాంధీకి, తెలంగాణ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాను.

అందుకు ప్రతిగా దూషణలు, బెది రింపులు ఎదుర్కొంటున్నానని అన్నారు. గద్దర్ పేరిట అవార్డు ప్రకటించడం ద్వారా తెలంగాణ కళలు, సంస్కృతిలో కొత్త విప్లవం మొదలవు తుందని భావించాను, కానీ ఇప్పుడు సినిమా రంగాన్ని ఏయే కులాలు ఆధిపత్యం చేస్తున్నాయో, ఎవరు పెత్తనం చేస్తున్నారో మనకందరికీ తెలు సని, వారు తెలంగాణ ప్రజల సంస్కృతి పట్ల ఎలాంటి వైఖరితో ఉంటారో కూడా మనకు తెలుసు, సినిమా అంటేనే డబ్బు కోసం అన్నట్లు ఉందన్నారు. ఇలా డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టు కున్న సినిమా సంస్కృతిని మార్చి, ఫూలే తరహా కొత్త తెలుగు సినిమా నిర్మాణ సంస్కృతిని తీసుకురావాలని గద్దర్ అవార్డు ద్వారా ఆశించాం, కానీ అటువంటి కొత్త ప్రారంభం ఎక్కడా కనిపించలేదు.

అవార్డు జ్యూరీలో ఒక్క జానపద కళా కారుడు కూడా లేదని, అందరూ డబ్బు కోసం పనిచేసే సినిమా కళాకారులేనని, ప్రజల కళలకు ప్రాతినిధ్యం ఎక్క? జ్యూరీలో గద్దర్ సాంస్కృతిక ప్రతినిధి ఎక్కడా? గద్దర్ పాపులర్ పాట అయినా పొడుస్తున్న పొద్దుమీద" అనే పాటకు ప్రాతినిధ్యం వహించే ఎస్సీ, ఎస్టీ, ఒబీసీ కళాకారులు ఎక్కడ? గద్దర్ అంటేనే ప్రజాపాట, అవార్డు ప్రధాన సమయంలో అటువంటి ప్రజాపాటల, ప్రజా కళాకారులకు సంబంధించిన ప్రజా కళల ప్రతినిధులు ఎక్కడ?గద్దర్ అవార్డును మరో నందీ అవార్డుగా మార్చేశారా? అని ఆవేదన వ్యక్తం చేశారు.

# బిసి పక్షపాతి ఆర్.కృష్ణయ్యను విమర్శించడం మానుకోవాలి

## - చేతనైతే 42 శాతం రిజర్వేషన్లకై ప్రభుత్వాన్ని ఒప్పించాలి.. 14 బిసి సంఘాల ప్రతినిధుల కమిటీ

**హైదరాబాద్, జూన్ 15 ప్రభాతవార్త :** నాలుగు దశాబ్దాలుగా బిసిల అభ్యున్నతికి అలుపెరుగని పోరాటాలు చేస్తున్న, బిసి పక్షపాతి ఆర్.కృష్ణయ్యను విమర్శించడం మానుకోవాలని 14 బిసి సంఘాల ప్రతినిధుల కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేవంలో వారు మాట్లాడుతూ సీఎం మెప్పు పొందేందుకు ఆర్.కృష్ణయ్యపై తప్పుడు ఆరోపణలు చేయడం, దిగజారుడు ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. బిసిలకు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్‌ను కల్పించాలని కోరడం నేరమా? అని ప్రశ్నించారు. ఓ బిసి అయి ఉండి బిసిల మేలు కోసం పోరాడుతున్న వారికి మద్దతు ఇవ్వకుండా రాజకీయ పబ్బం గడుపుకునే అగ్రకులాలకు మద్దతు ఇవ్వడం రావత్ మానుకోవాలన్నారు. నాలుగు దశాబ్దాల కాలంగా కృష్ణయ్య ఎవరిని వ్యక్తిగతంగా దూషించలేదని, బిసి హాస్టళ్లలో వసతులు కల్పించాలని, నాణ్యమైన ఆహారంను అందించాలని, సకాలంలో దుస్తులు, బుక్కులు ఇవ్వాలని, ఇంటర్ ఆపై విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్ మెంట్ బడ్జెట్ విడుదల చేయాలని పోరాడారని వివరించారు.

తన డిమాండ్లలో 80శాతం వరకు సాధించి బిసిలకు మేలు జరిగేలా కృష్ణయ్య పోరాడారని తెలిపారు. 1978లో వసతి గృహాలు పెంచాలని 200 మందితో అసెంబ్లీని ముట్టడిం చారని, 1979లో ఉద్యోగాలు భర్తీ చేయాలని 4 వేల మందితో సచివాలయంను ముట్టడించారని, 1984-85లో స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్లు వేలాది మందితో అసెంబ్లీని ముట్టడించారని స్పష్టం చేశారు.

పదువల కోసం, పైరవీల కోసం బిసిలను తాకట్టు పెట్టవద్దని బిసి సం ఘాలు ఏకకంఠంతో రావత్‌ను హెచ్చరిస్తున్నా యన్నారు. కృష్ణయ్యను అప్రతిష్టపాలు చేయాలని చూస్తే బిసి బిడ్డలంతా తిరుగబడుతారని తెలి పారు. ఈ కార్యక్రమంలో 14.బిసి సంఘాల ప్రతి నిధులు నీలం వెంకటేష్, అనంతయ్య, అంజి, మోడీ రాందేవ్, మణికంఠ, మల్లేష్ యాదవ్, రాజేందర్, వీరన్న, కృష్ణ యాదవ్, నర్సిహ్మాగౌడ్, కృష్ణ, వెంకన్నగౌడ్, చంద్ర, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## శంకుస్థాపన చేశారు.. పనులు ఎక్కడ సారూ..

**శేరిలింగంపల్లి, జూన్15 ప్రభాతవార్త :** శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేం దుకే పార్టీలు మారామని చెప్పుకునే ఎమ్మెల్యే అరికె పూడి గాంధీకి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదని బీజేపీ అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏడేళ్లుగా ఆగిపోయిన రోడ్డును ఎందుకు ముందుకు సాగ లేదో చెప్పాలని ఆయన నిలదీశారు. చందానగర్ డివిజన్‌లోని శ్రీదేవి థియోటర్‌నుంచి అమీన్‌పూర్ బందంకొమ్ము వరకు కలిపే కనెక్టివిటీ రోడ్డు శంకు స్థాపన చేసి ఏడేళ్లు కావస్తున్నా పనులు మాత్రం ఒక్క అడుగు జరగకపోవడంపై బీజేపీ నేతలు భగ్గు మన్నారు.2018లో 4 కోట్లరూపాయల మంజూరు తో ఎమ్మెల్యే చేతులమీదుగా శంకుస్థాపన చేసినా ఇప్పటికీ రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో శేరి లింగంపల్లి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, బీజేపీ ఇంచార్జి రవికుమార్ ఆధ్వర్యంలో కాలనీవాసులు, బీజేపీ నాయకులతో కలిసినిరసనకు దిగారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ. శ్రీదేవి థియోటర్ నుంచి అమీన్‌పూర్ వరకు కనెక్టి విటీ రోడ్డును 2018లో శంకుస్థాపన చేశారని, దాదాపు ఏడేళ్ల కావొస్తున్నా పనులు ప్రారంభించక పోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. గతంలో పంచాయతీఉన్న సమయంలోనే ముంబై-నాగపూర్ హైవే కోసం 150 ఫీట్ల రేడియల్ రోడ్డును ప్రపో జల్ ఉందని తెలిపారు. బిహెచ్ఈఎల్ నుంచి వయా శ్రీదేవీ థియోటర్, అమీన్‌పూర్, బందం కొము ్మ వరకు జీహెచ్ఎంసీ 45 కోట్ల రూపాయలు మంజూరు చేయటం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఇదికాకుండా గత ప్రభుత్వంలో టీయూ ఎఫ్ఐడీసీ ద్వారా 17 కోట్లు,ఎఫ్‌డీఎఫ్ ద్వారా 7 కోట్ల నిధులు మంజూరు అవ్వగా పటాన్‌చెరు ఎమ్మెల్యే మాత్రంఅమీన్‌పూర్ మునిసిపాలిటీలో పనులు చేయించుకుంటున్నా ర న్నారు. కాని చందానగర్ పార్టుగా ఉన్న 2 కిలో మీటర్ల రోడ్డు పనులు మాత్రం ప్రారంభానికి నోచుకోలేదన్నారు.

ప్రతి రోజు వేదల సంఖ్యలో వాహనదారులు, పాదచారులు, చుట్టుపక్కల దాదాపు 100 కాలనీల ప్రజలు తిరిగే ప్రాంతం కావడం వల్ల ప్రజలు రోజూ నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రభుత్వాల చేతకాని తనమా, ప్రజలు అధికారం ఇచ్చిన ఎమ్మెల్యే చేతగాని తనమా, అధికారుల నిర్లక్ష్యమా అని ప్రశ్నించారు.

# సోషల్ మీడియా.. మోసాలకు వేదిక !

- అసత్యప్రచారాలు, టైంపాస్ కబుర్లు
- వాస్తవాలను గ్రహించని నెటిజన్లు
- ఇన్‌స్టా, యూట్యూబ్, ఫేస్‌బుక్‌లకు అంకితమవుతున్న యువత
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు



**హైదరాబాద్,జూన్15, ప్రభాతవార్త:** ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా అసత్య ప్రచారాలకే యువత ఆకర్షితులవుతున్నారు. వాస్తవాలను గ్రహించకుండా అధికశాతం మోసాలబారిన పడుతున్నారు. నిజం తెలుసుకునేలోపు ఎన్నో ఘోరాలు జరిగిపోతున్నాయి. సమాజంలో మంచి చెడు రాజ్యమేలుతోంది. అది గుర్తించేదానిపై ఆధారపడి ఉంటుందని సామాజికవేత్తలు సూచిస్తున్నారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ వేదికలతో పాటు మరోన్నో మాద్యమాల్లో కొంత సమాచారం ఉన్న ఎక్కువగా టైంపాస్, కొత్త పరిచయాలు, బాతకానీలకే ఉపయోగిస్తున్నారు. ఎవరో ఎదో పోస్టులు పెడితే ఆరాటపడి నష్ట పోతున్నారు. ప్రతిభను చూపించుకునేందుకు ప్రాణాలకు తెగించి రీల్స్‌చేస్తూ వ్యూస్, లైక్స్‌కోసం మరికొందరు సాహసాలు ప్రదర్శిస్తున్నారు. తియ్యటి మాటలతో అమ్మాయిలకు గాలాలు, డిస్కౌంట్లు, ఆఫర్ల ప్రచారాలతో వ్యాపారస్తుల చిలుకపలుకలు..ఇలా ఎన్నో రకాలుగా కనిపించని శత్రువులతో నెటిజన్లు యుద్ధం చేస్తున్నారు. సోషల్‌మీడియాతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్న ఎంతోమంది బాధితులు మోసాలకు గురవుతున్నారు. ఇటీవల ఓ సినీనటి సోషల్‌మీడియాలో అసత్యప్రచారాన్ని వైరల్ చేయడంతో కేసు నమోదైంది. ఇలాంటి ఎన్నో ఘటనలు నగరంలో చోటు చేసుకుంటున్నాయి.

**రీల్స్, వ్యూస్, లైక్..ఆపై మోసాలు**

సోషల్ మీడియా యువతకు రీల్స్ చేయడం వ్యూస్, లైక్స్‌కోసం ఆరాటపడుతున్నారు. ప్రమాదార విన్యాసాలతో రీల్స్ చేస్తూ పోస్టులు పెడుతున్నారు. దీంతో నెటిజన్లు లైక్‌లు చేయడం, రీల్స్ చూడడంతో సంబరపడుతూ మరింతగా ఉత్సాహంగా దృష్టిసారిస్తున్నారు.ఇలా ఒకరికొకరు తెలియకుండానే పరిచయాలు చేసుకుంటూ మోసాలకు పాల్పడుతున్నారు. చీటింగ్, అసభ్యకర మెస్సేజ్‌లు, ప్రేమ వేధింపులు, మోసాలతో, బ్లాక్‌మెయిల్స్‌లాంటి ఫిర్యాదులు ఆయా పోలీస్ స్టేషన్లకు వస్తున్నాయి. దీంతో ఇటీవల హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సోషల్ మీడియాల్లో సమస్యలపై పలు కేసులు నమోదయ్యాయి. అదేవిధంగా ఆయా వ్యాపారసంస్థల ప్రచారాలతో డిస్కౌంట్లు, భారీ ఆఫర్‌లతో ఆన్‌లైన్ సౌకర్యం ఉందంటూ నమ్మించి పేమేంట్ రాగానే ఎస్కేప్ అయిన ఘటనలు ఉన్నాయి. అమ్మాయిల ఫోటోలు మార్ఫింగ్‌తో బ్లాక్‌మెయిల్ చేసి ఆకతాయిలు డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు. శత్రువులను కక్ష సాధించేందుకు వెనుకాడడం లేదు. ఇష్టారాజ్యంగా ఫోటోలు పెట్టి అసభ్యకరంగా, బూతులూ జోడించి లేనిపోని కామెంట్లతో పరువును బజారుకీడుస్తున్నారు.

**అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరికలు...**

సోషల్ మీడియా కేవలం సమాచారాలను తెలుసుకొని వాస్తవాలను గ్రహించాలని పోలీస్ అధికారులు సూచిస్తున్నారు. అందులో ఉన్న వాటిని ఎట్టి పరిస్థితుల్లో నమ్మి మోసపోకూడదని చెబుతున్నారు. ముఖ్యంగా అసభ్యకర పోస్టులు, మార్ఫింగ్ ఫోటోలతో వైరల్ చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు. పార్టీలు, రాజకీయ నేతలు, ఒక వ్యక్తిపై చెడు ప్రచారాలు చేసిన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వెల్లడిస్తున్నారు. వ్యాపారాలపై తప్పుడు ప్రచారాలు చేసిన ఊచలు తప్పవని పేర్కొంటున్నారు. అపరిచిత వ్యక్తులతో లావాదేవీలపై జాగ్రత్తగా ఉండాలి. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాలు, కుటుంబవిషయాలు, ఫోటోలు షేర్ చేయవద్దని పోలీసులు వెల్లడిస్తున్నారు. కొంతమంది ఆకతాయిలతో మోసాలకు గురికాక తప్పదని తెలియజేస్తున్నారు.

# కళాప్రదర్శనలతో విరబూసిన జయహో తెలంగాణ

### మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలాచారి

**రవీంద్రభారతి, జూన్ 15 ప్రభాతవార్త :** ఎంతోమంది చిన్నారి కళాకారులు శాస్త్రీయ, సంప్రదాయ, జానపద, ఆధ్యాత్మిక దేశభక్తి గీతాలు, కీర్తనల చిన్నారుల కళాప్రదర్శనలతో జయహో తెలంగాణ శీర్షికన రవీంద్రభారతి కళా మందిరంలో యావత్ తెలంగాణ రాష్ట్రం నవరసాలను విరబోస్తూ వెల్లివిరిసిందని మాజీ కేంద్ర మంత్రి డా. సముద్రాల వేణుగోపాలాచారి అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ, ప్రపంచ పర్యావరణ, పితృదినోత్సవాలను పురస్కరించుకొని ప్రముఖ సాంస్కృతిక, సాహిత్య, సామాజిక సేవాసంస్థ గ్లోబల్‌ఈవెంట్స్ ఆధ్వర్యంలో రవీంద్ర భారతి ప్రధాన మందిరంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ కె.వి.రమణారావు నిర్వహణలో జయహో తెలంగాణ శీర్షికన జరిగిన విలక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. సముద్రాల వేణుగోపాలాచారి విశిష్ట అతిథులు చకిలం సుధాకర్, రజనిరెడ్డి, డా. విజశ్రీ చౌదరి, సినీ టీవి కళాకారుడు గడ్డం నవీన్, టీవి జబర్ధస్త్ కళాకారుడు పటాస్ ప్రవీణ్, లయన్ కదిరి వెంకట రమణారావు, పలువురు నాట్యగురువులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి తెలంగాణ అమరవీరులకు 2నిముషాలు మౌనంపాటించి ఘననివాళులర్పించి జయహో తెలంగాణ అని నినదించి ప్రసంగించారు. ఎన్నో దశాబ్దాల పోరాటం, ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ప్రజలంతా సమైక్యంగా అన్నిరంగాల్లో ముందుకు తీసుకువెళ్లి ప్రజాప్రభుత్వం లక్ష్యం రైజింగ్ తెలంగాణ 2047ను సాకారం చేయడానికి నడుంబిగించాలని, ఈ విశ్వంలో సకల చరాచర జీవుల మనుగడకు పర్యావరణాన్ని కాపాడుకోవాలని, అహర్నిశలు ఎన్నో కష్టనష్టాలకోర్చి సమస్యల వలయంలో సమిధలవుతున్నా అనుక్షణం పిల్లల అత్యున్నత జీవితం కోసం తహతహలాడే తల్లిదండ్రులను వృద్ధాప్య చివరిదశలో అనాధలనుచేసి పాపాన్ని మూటకట్టుకోవద్దని హితవుపలికారు. ఈ సందర్భంగా చిన్నారుల కళాప్రదర్శనలే కాకుండా అతిథులు నవీన్, ప్రవీణ్‌ల హాస్య సందేశాత్మక ప్రదర్శనలు ప్రతీఒక్కరినీ ఆలోచింపజేశాయి. చివరిగా వివిధ ప్రదర్శనలతో తెలంగాణ జయహో అంటూ నీరాజనం సమర్పించిన కళాకారులు, వారి గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి శుభాభినందనలు తెలిపారు.




గురువులను సత్కరిస్తున్న వేణుగోపాలాచారి, రమణారావు, సుధాకర్, రజని తదితరులు

## జాతీయ రహదారి 163 విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

**నార్సింగి, జూన్ 15 ప్రభాతవార్త :** తెలంగాణ పోలీసు అకాడమి నుంచి మన్నెగూడ వరకు ఉన్న జాతీయ రహదారి 163.విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు గోపాల్‌రెడ్డి, అమరేందర్‌గౌడ్, సిపిరెడ్డి, మనోహర్, గోపినాథ్, భీంరెడ్డిలు డిమాండ్ చేశారు. రహదారి విస్తరణపై బండ్లగూడ కార్పోరేషన్‌లోని హైదర్షాకోట్ ఎస్ఎంపి పాఠశాలలో స్థానికులు పెద్ద ఎత్తున సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు వయోజనులు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానికి ఆనుకొని ఉన్న ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేగంగా ఈ రహదారి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలోని రోడ్ల నిర్మాణం వేగంగా కొనసాగుతుందని, పాలకులు పోలీసు అకాడమి-మన్నేగూడ రోడ్డుపై ఎందుకు శీతకన్ను వహిస్తున్నారని ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన కొడంగల్ నియోజకవర్గంకు ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారని, ఇంతటి ప్రాధాన్యత ఉన్న రోడ్డు విస్తరణ పనులను ఎందుకు వేగవంతం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై అధికారులు, పాలకులలో కదలిక వచ్చేలా మావంతు ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి, జగన్ మోహన్, మనోహర్, ప్రతాప్, రాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి.

# ఆర్టీఐ చట్టాన్ని కాపాడుకోవాలి

### కేంద్ర సమాచార మాజీ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధరాచార్యులు

**చిక్కడపల్లి, జూన్ 15 ప్రభాతవార్త:** ఆర్‌టిఐ చట్టం అమలుతీరు పొంచిఉన్న ప్రమాదాలు అనే అంశంపై హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం (హెచ్‌సిఎఫ్), పీపుల్స్ ఫ్రంట్ ఫర్ రైట్ టు ఇన్ఫర్మేషన్ (పిఎఫ్‌ఆర్ఐ) సంయుక్తంగా ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రం హాల్లో నిర్వహించిన చర్చా గోష్టిలో ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు మాట్లాడుతూ, ఆర్‌టిఐచట్టం చాలా విశిష్టత కలిగినదని, దానిని సక్రమంగా వినియోగించాలని, పిచ్చి పిచ్చి ప్రశ్నలతో అధికారులను వేధించటం కొరకు కాక సమాజానికి, ప్రజానీకానికి ఉపయోగపడే సమాచారాన్ని రాబట్టేలా ప్రశ్నలను అడగాలని సూచించారు. కొంతమంది అధికారులు ప్రశ్న రూపంలో అడిగితే సమాచారం ఇవ్వటం లేదని, సమాచారం రాబట్టటం ప్రధానం తప్ప ఏ రూపంలో అడిగారు అనేది ప్రధానం కాదని అలాంటి వారికి ప్రశ్న రూపంలో కాకుండా కావలసిన సమాచారాన్ని రాబట్టే పద్ధతిలో అడిగి సమాచారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రపంచంలోనే అతి గొప్ప సమాచార హక్కు చట్టం మనదేశంలో ఉన్నదని, అందుకు మనమంతా గర్వించదగిన విషయమని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై, మనందరిపై ఉన్నదని ఉద్భోదించారు. ఆర్టీఐ నిపుణులు శ్రీనివాస మాధవ్ మాట్లాడుతూ ఆర్టీఐ కార్యకర్తలు అడిగిన అనేక ప్రశ్నలకు చట్టాలను ఉదహరిస్తూ సమాధానాలు ఇచ్చారు. సమాచార హక్కు చట్టాన్ని నీరుగార్చేందుకు అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ అధికారులు సమాచారాన్ని ఇవ్వకుండా తప్పించుకునేందుకు అనేక వక్రమార్గాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. సమాచారం పొందటం ప్రజల హక్కుని, దాన్ని తిరస్కరించకుండా సమాచార హక్కు చట్టం రక్షణ కల్పిస్తున్నదని దానిని సక్రమమైన పద్ధతిలో వినియోగించుకోవాలని ఆర్టీఐ కార్యకర్తలకు సూచించారు. గతంలో ఒక ఉన్నతాధికారి తనకు చెప్పకుండా ఆర్టీఐ సమాచారం ఇవ్వవద్దని సర్క్యులర్ జారీ చేశారని, దానిపై ఒక ఆర్టీఐ కార్యకర్తలా స్టూడెంట్ హైకోర్టులో పిటిషన్ వేయగా హైకోర్టు సదరు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేయడం వెంటనే తను ఇచ్చిన సర్క్యులర్ ను వెనక్కి తీసుకున్నారని, అది సమాచార హక్కు చట్టం పవర్ అని సోదాహరణ గా వివరించారు. ఇతర రాష్ట్రాల కన్నా తెలుగు రాష్ట్రాలలో ఆర్టీఐ చట్ట వినియోగం, సమాచారాన్ని ఇస్తున్న తీరు లోపభూయిష్టంగా ఉన్నదని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సమాచార హక్కును కాపాడాలని సూచించారు. ఆర్టీఐ యాక్టివిస్ట్ ఎం. శ్రీనివాస్, ఆలిండియా లాయర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి, హెచ్‌సిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య, పిఎఫ్‌ఆర్ఐ అధ్యక్షులు యాదయ్య అధ్యక్షత వహించారు. అనేక మంది ఆర్టీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.సమాచార సేకరణలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆర్టీఐ కార్యకర్తలు తెలియజేశారు. ప్రశ్నలు నిపుణుల సమాధానాలు రూపంలో చర్చా గోష్టి సుమారు మూడు గంటలపాటు సాగింది. అనేక విషయాలపై సందేహ నివృత్తిచేసేలా చర్చ గోష్టి సాగింది. బీడీసీ అధ్యక్షులు ఎం శ్రీనివాసరావు, నాయకులు పి.శ్రీనివాసరావు, సంగీత, రాజమోళి, అస్మిత, లలిత, శ్వేత, సైదులు, గోపాల్, సుకుమార్, రమేష్, శంకరయ్య, అనేక సంఘాల నాయకులు, కార్యకర్తలు చర్చాగోష్టిలో పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసిన ఘనత మోడీదే: బిజెపిదే



మొక్కను నాటి నీళ్లుపోస్తున్న మున్సిపల్ బిజెపిఅధ్యక్షుడు సురేశ్ నాయక్

**ఘట్‌కేసర్‌రూరల్, జూన్15, ప్రభాతవార్త:** దేశప్రధానిగానరేంద్రమోడీ పదవికాలం చేపట్టి 11 సంవత్సరాల పరిపాలనలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందని జాతీయ గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యులు నానావత్ బిక్కునాయక్ అన్నారు. బీజేపీ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు నానావత్ సురేశ్ నాయక్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ దేశపు అమృతకాలం సేవ సుపరిపాలన కార్యక్రమంలో భాగంగా ఆదివారం అన్నోజిగూడలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని మొక్కలు నాటి నీళ్ల పోశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశప్రధానిగా నరేంద్రమోడీ అనేక రంగాల్లో దేశాన్ని పురోగతిదిశగా తీసుకువెళ్లడని అన్నారు. ఇటు పేద ప్రజల సంక్షేమం కొరకు పలు పథకాలతో పాటుగా దేశాన్ని పలు రంగాల్లో అభివృద్ధి పథంలో నడుపుతున్న నాయకుడు నరేంద్రమోడీయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు నానావత్ సురేశ్ నాయక్‌తో పాటు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గొంగళ్ల మహేశ్ కురుమ, మున్సిపల్ నాయకులు గొంగళ్ల బాలేశ్ కురుమ, రాజా రమేశ్, గుండె నరేశ్, వి. యాదగిరి, మేకల చంద్రిక రెడ్డి, కనకచారీ, కోన మల్లేశ్, సాయిరాజ్ నాయక్, గంజీ వంశీకుమార్, సరిత, శివసాయి, కవిత, ఆకాశ్, తరుణ్ నాయక్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్‌లో నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

**కడ్తాల్, జూన్ 14, ప్రభాత వార్త :** నేడు 16న లయన్స్ క్లబ్ ఆఫ్ అమనగల్లు నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం చేయనున్నట్లు లయన్స్ క్లబ్ పిఆ ర్వో పాషా తెలిపారు. ఎమ్ ఆర్ జీ ఫంక్షన్ హాల్, మైసిగండి అవరణలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సాయంత్రం ఐదు గంటలకు చేస్తు న్నట్లు ఆయన పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ 40వ అధ్యక్షుడిగా 2025 26 సంవత్సరానికి గాను కె. గోవర్ధన్ రెడ్డి, కార్యదర్శిగా జి. శ్రీను, కోశాధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, పిఆర్‌గా పాషా, మిగతా కార్యవర్గం సభ్యులంతా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు వారు తెలిపారు.

## నీట్‌లో మెరిసిన విద్యార్థి

**కడ్తాల్, జూన్ 15, ప్రభాత వార్త :** దేశ వ్యాప్తంగా వైద్యకళాశాలల్లో ప్రవేశాల



కోసంనిర్వహించిన నీట్ పరీక్షా ఫలితాల్లో కడ్తాల్ పట్టణ సమీపంలో ఉన్న ఫార్చ్యూన్ బటర్ఫ్లై స్కూల్ విద్యార్థిఅఖిల్, 5853,ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఆదివారం పాఠశాల వ్యవస్థాపకులు శేషగిరిరావు విద్యార్థి అఖిల్, తల్లిదండ్రులు బన్సీలాల్, బుజ్జి పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలుతెలిపారు. వారు మాట్లాడుతూ దేశ భవిష్యత్ విద్యార్థుల చేతుల్లో ఉందని ఇలాంటి ర్యాంకులు విద్యార్థులు సాధించి మన పాఠశాలకు మంచిపేరుతేవాలని వారు కోరారు. సహా వ్యవస్థాపకులు రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవ్ నాంపల్లి, ఉపాధ్యాయ బృందం,పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న డాక్టర్ వెంకట రమణ




**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్15 :** షాద్‌నగర్ పట్టణానికి చెందిన ఎంబీబీఎస్ డాక్టర్ వెంకట రమణ మిర్యాల ఉత్తమ అవార్డును అందుకున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లో సుమన్ టీవీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ డాక్టర్ల సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కొవిడ్ సమయంలో ఎంతో మంది ఉత్తమ సేవలు అందించారని, షుగర్ వ్యాధి గ్రస్తులకు ఎన్నో సేవలు అందించారని తెలిపారు. డాక్టర్ వెంకట రమణకు ఈ ఉత్తమ అవార్డు రావడం పట్ల పట్టణానికి చెందిన పలబట్ల బాలరాజ్ హర్షం వ్యక్తంచేశారు.

## బార్లను తలపిస్తున్న వైన్ షాప్ పరిసరాలు.

**నందిగామజూన్ 15 ప్రభాతవార్త**



బస్టాండ్ చౌరస్తాగడ్డ..మందు బాబులకు అడ్డగా మారింది. పట్ట పగలు వైన్ షాప్ పక్కనే మద్యం ప్రియులు దర్జాగా కూర్చొని మద్యం సేవించారు.లోపలికివెళ్లి త్రాగొచ్చుగా అంటే.. మా మందు మా ష్టం.. ఎవరొస్తే మాకేంటి అని బదులుసమాధానం చెబుతూఎంజాయ్ చేయడం నందిగామ మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం అగుపించింది.

## యువత క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి



**తాండూరు, జూన్ 15, ప్రభాతవార్త :** యువత క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని భారత మాజీ కెప్టెన్ అజారోద్దీన్ అన్నారు. గత కొన్ని రోజులుగా తాండూరు పట్టణంలోని విలియమూన్ మైదానంలో వ్యాపారి ముజీబ్ ఖాన్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు.ఆదివారం టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికిభారతమాజీ కెప్టెన్ అజారోద్దీన్ ముఖ్య అధితిగా హాజరయ్యారు.ఈసందర్భంగాఅజారోద్దీన్‌మాట్లాడుతూ ..తాండూరు ప్రాతానికి తనకు చాలా దగ్గరి సంబందాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గతంలో కూడా తాండూరుకి వచ్చానని గుర్తు చేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. యువత క్రీడా నైపున్యాన్ని మెరుగుపర్చుకోవాలని, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని సూచించారు. మరోవైపు స్థానిక ఎమ్మెల్యే మనోహార్‌రెడ్డి మాట్లాడుతూ. గ్రానం ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఇప్పటికే మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూళ్లో క్రీడలకు ప్రాధాన్యమిచ్చేలా దృష్టి సారిస్తామని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండలంలో విచ్చలవిడిగా బెల్టు షాపులు

## దాబాలో అనుమతిలేనిదే మద్యం సిట్టింగ్

**నవాబుపేట జూన్ 15,ప్రభాతవార్త :** మండలంలోని ఆయా గ్రామాల్లో బెల్ట్‌షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయని ఆయా గ్రామాలవారు తెలిపారు. మండల కేంద్రంలోని ఓ దాబాలో అనుమతిలేనిదే మద్యం సేవించడం జరుగుతోందని పలవురు తెలిపారు. ప్రభుత్వం మండల కేంద్రంలో మద్యం పేవించడానికి అనుమతితో కూడిన హాలు వైన్స్ ప్రాంగణంలోనే ఉన్నదని దాబాలో మద్యం సిట్టింగ్ నిర్వహించడంతో ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరచ్చే అనుమతి పొందిన హాలుకు నష్టం కలిగించేదిగా మారిందని పలువురు భావిస్తున్నారు. దాబా నిర్వహకులు స్థానికులు కావడం కాజకీయ అండదండలు ఉండటంతో వారిని అడ్డుకునే వారు లేరని ఈ నేపథ్యంలో మద్యం సేవించడాన్ని విచ్చలవిడిగా కొనసాగిస్తున్నట్లు పలువురు అన్నారు. బహింగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని పోలీసులు పూర్తిగా కట్టడి చేయడం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మ్ముమ్మరం చేయడంతో దాబా పంట పండిందని దీంతో మద్యం సేవించడానికి అడ్డు అదుపు లేకుండా పోయిందని పరిశీలకులు అంటున్నారు.

ఇదిలాఉండగా మండలంలోని ఆయాగ్రామాల్లో కిరాణాదుకాణాల్లో విచ్చలవిడిగా అక్రమంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని దీంతో గ్రామాల్లో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని ఆయా గ్రామాల వారు చెబుతున్నారు. సమయపాలన లేకుండా మద్యం లభించడంతో అర్థరాత్రివరకు మద్యం పేవించే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని తెలిపారు. మండల పరిధిలోని పూలపల్లి పెట్రోల్ బంక్ సమీపంలోని ఓ దుకాణంలో మద్యం విక్రయాలు వైన్‌షాపును తలపించేదిగా ఉంటుందని



మండల కేంద్రంలోని దాబా

ఇంత విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరగడం ఎంతవరకు సమంజసమని దీంతో అనార్థలు పొటుచేసుకుంటే బాధ్యత ఎవరు వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆదివారంగాగూడలో సహితం చిన్నపాటి వైన్‌షాపు కొనసాగుతుందని పట్టించుకునే నాథుడు లేకపోవడం విడ్డూరం. ఇదే తరహాలో అక్నాపూర్, అత్తాపూర్, మీనపల్లికలాన్, ఎక్‌మామిడి, మూలమాడ, మమ్మదాన్‌పల్లి, నాగిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డుపై, గుబ్బడిఫత్తేపూర్ రేణ్యా సరిహద్దులో అంతప్పగూడ చౌరస్తాలో, మాదిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డు వద్ద, చిట్టిగిద్ద రైల్వే స్టేషన్‌గ్రామంలో బెల్టుషాపుల నిర్వహిస్తున్నారని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని పలువురు కోరుతున్నారు. వివరణ కోరడానికి సంబంధిత అధాకారులు స్థానికంగా అందుభాటులో లేని విషయం విధితమే.

# బిసి లందరు ఐక్యంగా ఉండాలి : బిసి సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ



వెనకబడిన కులాలకు చెందిన ప్రజలంతా ఐక్యమత్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధ్యమవుతుందని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీసీ సేన మహిళా అధ్యక్షురాలు ఈరాపురం అనిల్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో బీసీలు అధిక శాతం ఉన్నప్పటికీ అన్ని రంగాలలో వెనకబడి ఉన్నారని, ఎన్నో ఏళ్లుగా అణిచివేతకు గురవుతూనే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా బీసీలందరు ఏకతాటి పైకి వచ్చి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నిల్లో బీసీల సత్తా చాటాలని పిలుపునిచ్చారు.బిసి అభ్యర్థులకు మద్దతునిచ్చి వారిని గెలిపించాలని అన్నారు. బీసీసేన రాజకీయ పార్టీలకు అతీతంగా బీసీల అభివృద్ధి కోసమే కృషి చేస్తుందని అన్నారు. ప్రతి పల్లె నుండి పట్టణం వరకు బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేసి చట్టసభల్లో ధమాషా ప్రకారం రిజర్వేషన్లు సాధించేంత వరకు సామూహికంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం బీసీసేన నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. బీసీసేన మండల అధ్యక్షుడిగా కొందుర్గుకు చెందిన ఐలాపురం రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎర్ర గౌరీ శంకర్, ప్రధాన కార్యదర్శిగా చిన్న రాజు గౌడ్, సహాయ కార్యదర్శిగా శీలం నర్సింలు, కోశాధికారిగా తీగలపల్లి శ్రీను, కార్యవర్గ సభ్యులుగా జంగం బుచ్చి లిగం, తంగళ్లపల్లి ఎల్లప్ప, కురువ మల్లయ్య, తొండపల్లి బుచ్చి లిగం, కొండ చంద్రశేఖర్‌లను ఎన్నుకున్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్15 :**

షాద్‌నగర్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో 2004-05 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఒకే వేదికపై కలుసుకున్నారు. పట్టణ సమీపంలోని ఓ రిస్టార్టులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆట పాటలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో రోజంగా గడిపారు. తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.తమకు విద్య నేర్పించిన గురువులు పాఠశాల ప్రిన్సిపల్ మందుముల రాధాకృష్ణ, ఉపాధ్యాయులు మందుములనరేందర్, ఇందిర,శశికాంత్, రఫత్ సుల్తానా, అనురాధ, బాలరాజ్, అజయ్ కుమార్‌లను సత్కరించారు. పూర్వ విద్యార్థులు ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్, సిద్ధిబాబు, అంకుర్‌నాథ్,



శిరీష,జోత్స్న, దీప,విజయదుర్గ పాల్గొన్నారు.

## పైప్‌లైన్ లకేజీతో రోడ్లపై పారుతున్న మురుగు



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్15 :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీ కారణంగా రెండు నెలలుగా రోడ్లపై మురుగు పారుతుందని గ్రామస్థులు కొందరు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోడ్డు గుండా ప్రయాణీకులు, పాదచారులు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, అయినా గ్రామ పంచాయతీ కార్యదర్శి గానీ, సిబ్బంది గానీ పట్టించుకున్న పాపన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులు ఫోన్ల ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ లీకేజీ సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## వీడియోకాన్ఫరెన్స్‌ను జయప్రదం చేయండి

**పూడూరు,జూన్ 15, ప్రభాతవార్త :** పూడూరు మండల కేంద్రంలోని పూడూరు రైతువేదికతోపాటు చెన్‌గోముల్,కంకల్ గ్రామాల రైతువేదికల్లో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి తులసీరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.సాయంత్రం 4-00 గంటలకు ప్రారంభమయ్యే రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి రైతులతో ముఖాముఖి ప్రత్యక్షప్రసారం కార్యక్రమం ఉంటుందని,ఇట్టి కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు తమకు అందుబాటులో ఉన్న రైతువేదికలో భారీసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## రైతు భరోసాకు ధరఖాస్తు చేసుకోండి

**శంకర్‌పల్లి, జూన్ 15, ప్రభాతవార్త:** శంకర్ పల్లి మండలంలోని రైతులు రైతు భరోసా పథకానికి ఈ నెల 18వ తేదీ లోపు ధరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. సురేష్ బాబు సూచించారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు ప్రతి ఏడాది రూ. 12,000 ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని, జూన్ 5, 2025 వరకు కొత్తగా పట్టా పాస్‌బుక్కులు పొందిన రైతులు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆయా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద గల ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

## ఆలయంలో అగ్నిహోమం..అన్నప్రసాదం
## నేడు వార్షికోత్సవం..స్వామి కళ్యాణం



**ఘట్‌కేసర్, జూన్15, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌మున్సిపల్ ఎదులాబాద్‌లోని శ్రీభ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలోవార్షిక పూజలుఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఆలయ ఆవరణలో అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య అగ్నిహోమం నిర్వహించారు.ఆలయ ధర్మకర్తలు కంట్లం గౌరీశంకర్, శివకుమార్ దంపతులు హోమంలో పాల్గొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. గౌరీశంకర్, కళావతిల 50వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పలువురు దంపతులను సన్మానించారు. సోమవారంఆలయ2వ వార్షికోత్సవం సందర్భంగా భ్రమరాంబికాదేవి, మల్లికార్జునస్వామిల కళ్యాణం నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ధర్మకర్తలు కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజురు పత్రాలు అంద జేత

## ఎమ్మెల్యే.రాంమోహన్‌రెడ్డి

**దోమ. జూన్ 15 ప్రభాతవార్త.** ఇందిరమ్మ ఇళ్ళు మంజురు అయిన లబ్దిదారులు వెంటనే పనులు ప్రారంబించాలని పర్గి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి అన్నారు.ఆదివారం నాడు దోమ మండల పరిదిలోని దాదాపూర్ గ్రామములోని రైతు వేదిక భవనంలో మండలములోని ఆయా గ్రామాలకుఇందిరమ్మ ఇళ్ళు మంజురు అయిన సందర్బముగ 249 మంది లబ్దిదారులకు ప్రోసిడింగ్‌లు అందజేశారు.ఈ సందర్బముగ ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని,ప్రభుత్వంఏర్పడిన 48 గంటల్లోనే మహాలక్ష్మి పథకం,ఆర్టీసి బస్సులో ఉచిత ప్రయాణం చేపట్టిందని గుర్తు చేశారు.అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్ళు మంజురు అవుతాయని ప్రజలు ఆందోళన చెందవద్దని తెలిపారు.

ఎస్సి,ఎస్టి,బిసి యువతకు రాజీవ్‌యువ వికాసం ద్వారా ఒక్కో నిరుద్యోగ యువతకు 50 వేల నుండి 4లక్షల వరకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించబోతుందని అన్నారు.వర్షాకాలం నేపథ్యంలో మూడు నెలలకు సరిపడ రేషన్ సన్నబియ్యం ఒకేసాఆరి అందించడము జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమముల దోమ మండల కాంగ్రెస్‌పార్టీ అద్యక్షులు విజయ కుమార్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మెన్ యాదవరెడ్డి,మండల మహిళా




.ఇళ్ళ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

సంఘం అద్యక్షురాలు అనుసూయ,పర్గి మార్కెట్‌కమిటి చైర్మెన్ గుండాల ప్రబాకర్‌రెడ్డి ,శాంత్‌కుమార్,కాంగ్రెస్‌నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బంగ్ల యాదయ్య,జిల్లా కాంగ్రెస్‌పార్టీ అదికార ప్రతినిది రమేశ్‌గౌడ్,యూత్ అద్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి,బసన్నగౌడ్,శేఖర్,చెన్నయ్య,పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి పండగ



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్15 :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు సోలీపూర్ గ్రామంలో ఆదివారం బొడ్రాయి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టించి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలను నిర్వహించినట్లు గ్రామస్థులు తెలిపారు. సాయంత్రం బోనాల పండగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు సునీల్ పంతులు, వెంకటేశ్వర రావు, అభిషేక్ పంతులు, మాజీ వార్డు సభ్యుడు సింగపాగ లక్ష్మయ్య, శివరాములు యాదవ్, పులిమామిమడి రాజేష్ గౌడ్, సింగపాగ అనిల్ కుమార్, చీపిరి వెంకటేష్ యాదవ్, చీపిరి రమేష్ యాదవ్, సతీష్, వెంకటేష్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, కృష్ణయ్య, మున్నూరు నరేందర్, చీపిరి బాల్‌రాజ్, చీపిరి లక్ష్మయ్య, అంజయ్య, యాదయ్య, కృష్ణయ్య, సింగపాగ వెంకటేష్, అంజిరెడ్డి, శేఖర్, పాల్గొన్నారు.

## మర్పల్లిలో వాగులపైకల్వర్టు నిర్మించండి

**మర్పల్లి, జూన్15ప్రభాతవార్త:** మర్పల్లిమండలంలోని సిరిపూరం, రావులపలి,వాగులు వర్షాకాలంలో వరద నీటితో ప్రమాద కరంగా మారుతున్నాయని వాటిపై కర్వర్టులు నిర్మించాలని పలువురు ప్రయానికులు కోరుతున్నారు.వర్షాకాలంలో వాగులు రావడంతో కంటల తరబడి వాహనాలు రాకపోకలు ఆగిపోతున్నాయి.రాగులపల్లి వాగుకు కర్వర్టునిర్మాణం లేకపోవడంతో గతంలో పెండ్లి కారు కొటుకు పోగా నవవదువుతోపాటు మరో ఇద్దరు కొటుకుపోయిన సంఘటన విదితమే అలాగే సిరిపురం వాగులోపలు ప్రమాదాలు జరిగాయి.మండలంలోని గుర్రంగట్టు తాండాలో గలవాగులో గతంలో మహీళ కొటుకు పోయి మృతి చెందిందిసిరిపురం వాగు వస్తె మర్పల్లికి రావడాకిమరోమార్గం లేదని బారి వరదనీరు వచ్చినప్పు సదాసివపేట్‌నుండి రావలసివస్తుందని ప్రయానికులు అంటున్నారు.సిరిపురం, రాగులపల్లి గుర్రంగట్టు వాగులపై కల్వర్టులు నిర్మించాలని ప్రయానికులు కోరుతున్నారు.

## మర్పల్లి నుండి బుదేరాకు బస్సునడపండి

**మర్పల్లి జూన్ 15 ప్రభాతవార్త :** మర్పల్లి మండల కేంద్రం నుండి బుదేరాకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయానికులు పలు ఇబ్బందులు పడుతున్నారు.ఇక్కడి నుండి ఒక్కబస్సు కూడా లేకపోవడంతో సదాశివపేట్,జహీరాబాద్ వెళ్ళాలంటే ప్రైవేట్ వాహనాలు దికుకగా మారాయని,అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు.సాయంత్రం 5 దాటితే రవాణ సౌకర్యం లేకపోవడంతో తమ పడే బాదలు వర్ణనాతీతంగా మారాయని ప్రయానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆర్టీసి అధికారులు ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెటుకొని మర్పల్లి నుడిబుదేరకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## అన్నదానంపాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్1) :** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామ శివారులో గల వేద పాఠశాలలో కాంగ్రెస్ నాయకుడు రఘు జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాశీ జగద్గురు డాక్టర్ చంద్రశేఖర్ శివాచార్య వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వీరశైవ సమాజం గౌరవ అధ్యక్షుడు అగ్గనూరు బస్వం, వేద పాఠశాల అధ్యాపకుడు సంగయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్, ఇబ్రహీం, బాలరాజు గౌడ్, కెకె కృష్ణ, బుడ్డ నర్సింహ్మా, అంజి యాదవ్, మహబూబ్, పాల్గొన్నారు.

## మంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన శ్రీవర్ధన్ రెడ్డి



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జూన్15 :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి జన్మదినం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లిశ్రీవర్ధన్‌రెడ్డిశుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిషన్ రెడ్డి క్రమ శిక్షణ, నిబద్దతతో పనిచేస్తూ అంబర్‌పేట నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా, సికింద్రాబాద్ నుండి రెండు సార్లు ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా ఎదిగారని గుర్తు చేశారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందనడానికి కిషన్‌రెడ్డి ఒక నిదర్శనమని కొనియాడారు. నిత్యం ప్రజల్లో ఉంటూ అవినీతికి తావులేకుండా సమాజ అభివృద్ధి కోసం పాటు పడిన నాయకుడు కిషన్ రెడ్డి అని అన్నారు.

## సేవాభావంతోవైద్య సేవలు అందించాలి

**యూసుఫ్‌గూడ, జూన్ 15, ప్రభాతవార్తా :** పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించటంలో వైద్యులు ప్రత్యేక చొరవ చూపాలని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం మోతీనగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రివైవ్ హాస్పిటల్ ఎమర్జెన్సీ బ్లాక్‌ను, ఆస్పత్రి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్పత్రిలో రోగులకు అన్ని రకాల వసతులను అందించటంతో ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలను ఏవిధంగా ఉంచుకోవాలని శానిటేషన్ సిబ్బందికి వివరించారు. వైద్య రంగం చాలా గొప్పదని భగవంతుని ఏవిధంగా కొలుస్తామో తన ప్రాణాన్ని నిలబెట్టే వైద్యులను కూడా భగవంతుడిగా ప్రజలు పూజిస్తారని అన్నారు. వైద్యులకు ఏలాంటి సమస్యలు ఉన్నా రోగులతో సక్రమంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్, ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ సాయిబాబా, డాక్టర్ రవికుమార్, బీజేపీ డివిజన్ అధ్యక్షులు ఎర్రస్వామి, శ్రీనవాసాచారి, భాస్కర్, రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నాం.

## ప్రజలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి

**– రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

**నార్సింగి, జూన్15 ప్రభాతవార్త :** ప్రజలందరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో వందరోజుల ప్రణాలికలో భాగంగా కమీషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి 5.కే.రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, సిడిఎంఓ కె.శ్రీదేవిలు ప్రారంభించారు. ప్రజలు, అధికారులు, ఎన్జీఓ సంఘాల ప్రతినిధులు, యువకులు ఉత్సాహంగా 5.కె.రన్‌లో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. అనంతరం మొక్కలు నాటి, ప్రజలందరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి మూడేళ్ల పాటు సంరక్షించాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రేయింబవళ్లు తెలంగాణ అభివృద్ధి కోసం కష్టపడుతున్నారన్నారు. రైతులు, ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులు, యువకులు ఇలా అన్ని రంగాల ప్రజలకు మేలు జరిగే అనేక సంక్షేమ పతకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. దేశంలో తెలంగాణ ఒక్క ప్రభుత్వమే ఏక కాలంలో రైతులకు రూ2.లక్షల రుణమాఫీ చేసిందన్నారు. రేషన్ కార్డుదారులందరికి ఉచితంగా సన్నబియ్యంను అందిస్తున్నారని వివరించారు. మున్సిపాలిటీలను వేగంగా అభివృద్ధి చేసేందుకు 100.రోజుల ప్రణాలికను రూపొందించారని, అధికారులు, ప్రజలు అందరిని ఇందులో భాగస్వాములను చేసి మెరుగైన పాలన అందించేందుకు కృషి జరుగుతుందన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, రామేశ్వరం నర్సిహ్మా, మేకల ప్రవీణ్ యాదవ్, పాపిరెడ్డి, గండయ్య ముదిరాజ్, దశరథ్ యాదవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.